# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 247, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) గురువారం - 21 - నవంబర్ - 2024


## యూకేలో వెటర్నరీ డాక్టర్ ఆత్మహత్య.. కారణం తెలిస్తే హృదయం ద్రవించిపోతుంది..!



- పెంపుడు జంతువుల విషయంలో సంపన్నుల పీనాసితనంతో డాక్టర్ కు విరక్తి
- వైద్యానికి ఖర్చు చేయడం ఇష్టంలేక 'యూథనేషియా' కోసం అభ్యర్థిస్తున్నారని వెల్లడి
- తన చేతులతో చాలా జంతువులను చంపేశానని ఆవేదన

## మళ్లీ భారత్, చైనా డైరెక్ట్ విమానాలు ? కైలాష్ సరోవర్ యాత్ర కూడా..!



న్యూఢిల్లీ : భారత్, చైనాల మధ్య దాదాపు మూడేళ్లుగా సాగిన సరిహద్దు ప్రతిష్టంభన వీడిన నేపథ్యంలో ఇరు దేశాలూ మరికొన్ని సానుకూల అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య కరోనా సమయంలో సరిహద్దు వివాదం రాకముందు ఉన్న పరిస్థితుల్ని తిరిగి పునరుద్ధరించేందుకు మిగతా..2లో

## జీవో 29పై విచారణ వాయిదా.. ఏం జరగబోతుంది

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 పై విచారణను హైకోర్టు నవంబర్ 26 కు వాయిదా వేసింది. తెలంగాణలో ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ముగిశాయి.. పరీక్షలు ముగిసిన సరే జీవో 29 రద్దు కోరుతూ ఇంకా అభ్యర్థులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. అయితే, తాజాగా బుధవారం హైకోర్టులో మిగతా..2లో




## బెల్టు షాపు పెడితే.. బెల్టు తీస్తా: చంద్రాబాబు మాస్ వార్నింగ్



- ఎవరైనా క్రైమ్ కు పాల్పడితే తాట తీస్తానన్న చంద్రబాబు
- వైసీపీ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్ పైకి వెళ్లిందని విమర్శ
- రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని వ్యాఖ్య

## కాంగ్రెస్ కీలక నిర్ణయం.. !!



న్యూఢిల్లీ : జార్ఖండ్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జోరుగా కొన సాగుతోంది. మొత్తం 38 నియోజకవర్గాల్లో పలువురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించుకుంటోన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి నిల్చున్నారు.

**ప్రజాస్వామ్య దేశంలో అతిపెద్ద పండగ..!!**

అటు మహారాష్ట్రలో 288 నియోజక వర్గాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటోన్నారు. జార?ండ్‌తో పోల్చుకుంటే మహారాష్ట్రలో తొలి రెండు గంటల్లో పోలింగ్ మందకొడిగా సాగడం గమనార్హం. మధ్యాహ్నం 3 గంటల సమయానికి జార?ండ్‌లో 61.47 శాతం మేర పోలింగ్ రిజిస్టర్ అయింది. మహారాష్ట్రలో ఈ సంఖ్య 45.53 శాతమే. ఈ రెండింటితో పాటు దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో ఉప ఎన్నికల పోలింగ్ కూడా ముమ్మరంగా సాగుతోంది. మహారాష్ట్రలోని నాందెడ్ మిగతా..2లో

## డబ్బుల్లేవు.. కానీ ఆలోచనలున్నాయి..

# నా జీవిత ఆశయం అదే

- : సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు
- 413 రోజుల రికార్డ్ టైమ్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపడితే దాన్ని కాపాడుకోవడం తెలీ
- పోలవరం ప్రాజెక్టు 2021లోనే ప్రాజెక్ట్ పూర్తయ్యేదని చెప్పారు సీఎం చంద్రబాబు
- ఎట్టి పరిస్థితుల్లో 2027కల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని మాటిచ్చారు చంద్రబాబు
- నదుల అనుసంధానం పూర్తి చేయాలనేది నా జీవిత ఆశయం

2లో



అమరావతి : గతంలో వైఎస్ఆర్ అసాధ్య మన్న పోలవరం ప్రాజెక్టును సుసాధ్యం చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.. కేంద్ర ప్రభుత్వ సహకారం ఉన్నప్పటికీ, జాప్యం కా కూడదన్న ఉద్దేశంతోనే పోలవరం నిర్మాణ బాధ్యతలు తీసుకున్నామని చెప్పారు.


## ఎమ్మెల్యేలను గెలిపించుకోలేని జగన్.. ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటు: షర్మిల



- అసెంబ్లీకి వెళ్లని జగన్ కు ఎమ్మెల్యే పదవి ఎందుకని ప్రశ్నించిన షర్మిల
- కడప్ స్టీల్ ప్లాంట్ కు జగన్, అవినాశ్ ఏం చేశారని ప్రశ్న
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమయిందని వ్యాఖ్య

## కేసీఆర్ అనే మొక్కను ఇక తెలంగాణ గడ్డపై మొలవనివ్వను..

# సీఎం రేవంత్ రెడ్డి శపథం..!



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ విజయోత్సవ సభలో సంచలన కామెంట్స్ చేశారు. కేసీఆర్ నిన్ను తొక్కుకుంటూ.. ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ వచ్చి నీకు కుర్చీ లాక్కున్నా.. నువ్వు ఫామ్ హౌజ్ లో మిగతా..2లో

- మాట ఇస్తే తల తెగిపడినా మడమ తిప్పని నైజం కాంగ్రెస్ ది
- అసెంబ్లీలో చర్చ పెడదాం డేట్ నువ్వు చెప్పినా సరే - నన్ను చెప్పమన్నా సరే
- తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా విజయోత్సవ శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ
- అభివృద్ధిని అడ్డుకుని ఎవరైనా కుట్రలు కుతంత్రాలు చేస్తే, జైలులో పెట్టి ఊచలు లెక్క పెట్టిస్తా

2లో

## చంద్రబాబు ఎఫెక్ట్..! ఇక రోడ్డెక్కితే బాదుడే?



2లో

- కూటమి అధికారంలోకి రావడానికి వైసీపీ ఓటమికి పాడైన రోడ్లు కూడా కీలక పాత్ర పోషించాయి
- దాంతో గుంతలు పూడ్చడానికి అన్నట్లుగా 850 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది
- కార్లు బస్సులు కార్లు వంటి వాహనాలే పరిమితం చేద్దామని చంద్రబాబు



## రేవంత్ స్పెషల్ ఫోకస్ - కీలక ప్రకటన..!!

హైదరాబాద్ : ముఖ్యమంత్రిగా రేవంత్ బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తవుతోంది. ఏడాది కాంగ్రెస్ పాలన వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమ యంలో ముఖ్యమంత్రి రేవంత్ వరుస జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. జిల్లాల్లో పలు వరాలు ప్రకటి స్తున్నారు. కొత్తగా అభివృద్ధి పనులకు సీఎం శంకు స్థాపనలు నిర్వహిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పైన ప్రత్యే కంగా ఫోకస్ చేసిన రేవంత్ తాజాగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

రేవంత్ ఫోకస్

ముఖ్యమంత్రి రేవంత్ వేములవాడ రాజన్న ఆలయం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న సీఎం రేవంత్‌కు ఆల య అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆపై శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆపై ముఖ్యమంత్రి కోడె మొక్కులు చెల్లించు కున్నారు. ఇక..రూ. 76 కోట్లతో చేపట్టే మిగతా..2లో

## 11 నెలల కాలంలో 42 మంది విద్యార్థులు మృతి.. రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ హరీశ్‌రావు



2లో

- కేతెపల్లి మండల పరిధిలోని బీసీ గురుకులంలో ఓ విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు
- ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు
- పురుగులన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటించినా పట్టించుకోడు

## చంద్రబాబులో ఎప్పటికీ మార్పురాదు

# : వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు

- చంద్రబాబు అబద్ధాల మీద అబద్ధాలు చెబుతున్నారని మండిపాటు
- అప్పుల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- మేం చేసిన పనులు చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నాడని ఆరోపణ

2లో



అమరావతి : చంద్రబాబు అబద్ధాల మీద అబద్ధాలు చెబు తున్నారని... ఆయనలో ఎప్పటికీ మార్పు రాదని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ విమర్శించారు.

శుభోదయం
గురువారం- 21 - నవంబర్ - 2024

# యూకేలో వెటర్నరీ డాక్టర్ ఆత్మహత్య.. కారణం తెలిస్తే హృదయం ద్రవించిపోతుంది..!

న్యూఢిల్లీ : పెంపుడు జంతువుల పట్ల సంపన్నులు చూపుతున్న పీనాసితనంతో ఓ వైద్యుడు విరక్తి చెందాడు. తన చేతులతో చాలా జంతువులను చంపేయాల్సి వచ్చిందని డిప్రెషన్ కు లోనై ఆత్మహత్య చేసుకున్నాడు. నొప్పి తెలియకుండా జంతువుల ప్రాణంతీసే మందును తన శరీరంలోకి ఎక్కించుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. లండన్ కు చెందిన ఈ వెటర్నరీ డాక్టర్ ఉదంతం గురించి తెలిస్తే కంటతడి పెట్టించక మానదు. లండన్ లోని వించెస్టర్ లో జాన్ ఎల్లిస్ వెటర్నరీ డాక్టర్ గా పనిచేస్తున్నాడు. వయసు 35 ఏళ్లే అయినా తన వృత్తిలో బాగా పేరు సంపాదించుకున్నాడు. జంతువులను చూస్తూనే వాటి అనారోగ్యాన్ని గుర్తించగలడని ఎల్లిస్ సహచర వైద్యులు చెబుతుంటారు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే వ్యక్తి సడెన్ గా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జంతువుల యూథనేషియాకు ఉపయోగించే మందుతో తన ప్రాణం తీసుకున్నాడు. ఈ విషయంపై డాక్టర్ ఎల్లిస్ తల్లి టినా ఎల్లిస్ మాట్లాడుతూ.. పెంపుడు జంతువుల విషయంలో తన క్లయింట్లు చూపుతున్న నిర్లక్ష్యం, పీనాసితనంతో తన కొడుకు తీవ్రంగా బాధపడేవాడని తెలిపారు. వైద్యం చేయించడం కోసం పెట్టే ఖర్చు కన్నా వాటిని యూథనేషియా ద్వారా చంపేయడమే మేలని తన క్లయింట్లు భావిస్తున్నారని చెప్పాడన్నారు. లగ్జరీ కార్లలో తిరుగుతూ, ఖరీదైన లైఫ్ స్టైల్ మెయింటెన్ చేస్తున్న వారు తమ పెంపుడు జంతువుల విషయంలో మాత్రం పీనాసితనంతో వ్యవహరిస్తున్నారని తనతో చెప్పేవాడన్నారు. వైద్య ఖర్చులు భరించడం కన్నా నొప్పి తెలియకుండా వాటిని చంపేయాలని కోరేవారని, ఉద్యోగ బాధ్యతల కారణంగా గత్యంతరం లేక తాను చేయాల్సి వస్తోందని ఆవేదనకు గురయ్యేవాడని వివరించారు. ఇది తట్టుకోలేక ఒత్తిడికి లోనై చివరకు తనే బలవన్మరణానికి పాల్పడ్డాడని టినా ఎల్లిస్ చెప్పారు.

# మళ్లీ భారత్, చైనా డైరెక్ట్ విమానాలు ? కైలాష్ సరోవర్ యాత్ర కూడా..!

మొదటి పేజి తరువాయి

అడుగులు పడుతున్నాయి. ఇదే క్రమంలో ఇవాళ చైనా విదేశాంగమంత్రితో మన విదేశాంగమంత్రి జై శంకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రెజిల్ లోని రియోడిజనీరోలో జరిగిన భేటీలో భారత్, చైనా విదేశాంగమంత్రులు జై శంకర్, వాంగ్ యీ రెండు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జీ20 సదస్సు కోసం హాజరైన వీరిద్దరూ విరామంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరూ భారత్, చైనా మధ్య డైరెక్ట్ విమాన సర్వీసుల పునరుద్ధరణపై చర్చించారు. అలాగే కైలాష్ మానస సరోవర్ యాత్రను పునరుద్ధరించే అంశంపైనా చర్చించారు. కోవిడ్ మహమ్మారి కారణంగా గతంలో భారత్, చైనా మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు నిలివేశారు. అంతలోనే సరిహద్దు వివాదం కూడా తెరపైకి రావడంతో వాటిని తిరిగి పునరుద్ధరించలేదు. అప్పట్లో లడఖ్‌లో మొదలైన ప్రతిష్టంభన గాల్వాన్‌లో ఘర్షణలకు దారి తీసింది. ఇందులో 20 మంది భారతీయ సైనికులు చనిపోవడం, చైనా కూడా భారీగా బలగాలు నష్టపోవడంతో చర్చలు ప్రారంభమయ్యాయి. వివిధ దశల్లో జరిగిన చర్చలు ఫలించి తాజాగా ఇరు దేశాలూ సైనికుల్ని వెనక్కి రప్పించాయి. ఇప్పుడు ఇరుదేశాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసుల పునరుద్ధరణ, మానస్ సరోవర్ యాత్ర కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారు.

# జీవో 29పై విచారణ వాయిదా.. ఏం జరగబోతుంది

మొదటి పేజి తరువాయి

జీవో 29 పై విచారణ జరగాల్సి ఉండగా.. ధర్మాసనం మళ్లీ విచారణను వాయిదా వేసింది.. ఇప్పటికే.. గ్రూప్ 1 పరీక్షలు ముగిసినా జీవో 29 పై తేలకుండా ఫలితాలు వెల్లడించవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈరోజు హైకోర్టులో జరిగే విచారణపై అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. జీవో 29 పై తేలకుండానే ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిందని ఇప్పటికే అనేక మంది అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు.. అక్టోబర్ నెలలో అభ్యర్థుల ఆందోళనల నడుమనే ప్రభుత్వం మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. పరీక్షలు రద్దు కోరుతూ గతంలోనే అభ్యర్థులు సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారు. చివరి నిమిషంలో సుప్రీంకోర్టును ఆశ్రయించినందున తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టులోనే తేల్చుకోవాలని అభ్యర్థులకు స్పష్టం చేసింది. దీంతో బుధవారం జీవో 29 పై హైకోర్టులోనే తమకు న్యాయం జరుగుతుందని అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేసారు. అయితే దీనికి సంబంధించిన విచారణ ఈ నెల 26 కు హై కోర్టు వాయిదా వేసింది. రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న జీవో 29 పై రాజకీయ రగడ సైతం తార స్థాయికి చేరింది. పరీక్షలు మొదలయ్యే సమయంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 ద్వారా అణగరిన వర్గాలకు చెందిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన చేసిన అభ్యర్థులకు మద్దతుగా ప్రతిపక్ష పార్టీలు సైతం ఉద్యమించాయి. అన్ని ఆందోళనల నడుమ మెయిన్స్ పరీక్షలు ప్రభుత్వం సజావుగా నిర్వహించింది. దీంతో ఇక తమ ఆశలన్నీ హైకోర్టు పైనే పెట్టుకున్నారు అభ్యర్థులు. జీవో 29 పై గత కొన్ని నెలలుగా అభ్యర్థులు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే ఇప్పుడు పరీక్షలు కూడా ముగియటతో జీవో 29 పై హైకోర్టు ఏం చెప్తుంది అనే ఉత్కంఠతో అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.


# బెల్టు షాపు పెడితే.. బెల్టు తీస్తా: చంద్రాబాబు మాస్ వార్నింగ్

అమరావతి : మద్యం అమ్మకాలు పారదర్శకంగా ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం వైన్ షాపుల ద్వారా మాత్రమే అమ్మకాలు జరగాలని చెప్పారు. ఎవరైనా బెల్టు షాపులు పెడితే... వారి బెల్టు తీస్తామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. బెల్టు షాపులు లేకుండా స్థానిక ఎమ్మెల్యేలు చూసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో ఎవరైనా క్రైమ్ కు పాల్పడితే తాట తీస్తానని హెచ్చరించారు. అమ్మాయిలు, మహిళలపై సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే అదే వారికి ఆఖరి రోజు అన్నారు. అసెంబ్లీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజలు తనను ఆదరించారని... ఎక్కువసార్లు ప్రజలు తనను సీఎం చేశారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో తనను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని... జైలుకు కూడా పంపించారని అన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా తాను ప్రజల కోసమే పని చేశానని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్ పైకి వెళ్లిందని అన్నారు. కీలక సమయంలో ప్రజలు తమకు ఘన విజయం అందించారని చెప్పారు. కేంద్రం అన్ని విధాలుగా సాయం చేస్తోందని చెప్పారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని అన్నారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు రూ. 4 వేలకు పెంచామని చంద్రబాబు చెప్పారు. 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. వైసీపీ పాలనలో రూ. 10 లక్షల కోట్ల అప్పులు చేశారని మండిపడ్డారు. అప్పులను లెక్కలతో సహా అసెంబ్లీలో చూపించామని చెప్పారు. పేదలకు పక్కా ఇళ్లను నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు.

# ఎమ్మెల్యేలను గెలిపించుకోలేని జగన్.. ప్రతిపక్ష హొదా అడగడం సిగ్గుచేటు: షర్మిల

అమరావతి : తన అన్న, వైసీపీ అధినేత జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష హొదాకు అవసరమైనంత మంది ఎమ్మెల్యేలను కూడా గెలిపించుకోలేని జగన్... ప్రతిపక్ష హొదా అడగడం సిగ్గుచేటని అన్నారు. అసెంబ్లీకి వెళ్లని జగన్ కు ఎమ్మెల్యే పదవి ఎందుకని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ కోసం జగన్, కడప వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. ఇలాంటి నాయకులను ఎన్నుకునే ముందు ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. కడపలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కడప స్టీల్ ప్లాంట్ కేవలం శంకుస్థాపనలకే పరిమితమయిందని షర్మిల అన్నారు. పేదల కోసం, కడప ప్రాంతం అభివృద్ధి కోసం వైఎస్సార్ దీన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా 25 వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే అవకాశం ఉందని అన్నారు. వైఎస్ చనిపోయిన తర్వాత వచ్చిన నాయకులందరూ కడప స్టీల్ ప్లాంట్ ఊసే లేకుండా చేశారని విమర్శించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ కూడా కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని విస్మరించారని షర్మిల దుయ్యబట్టారు. మూడేళ్లలో స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటానని ఆస్కార్ లెవెల్లో జగన్ డైలాగులు చెప్పారని ఎద్దేవా చేశారు. పదేళ్లుగా కడప ఎంపీగా ఉన్న అవినాశ్ రెడ్డి స్టీల్ ప్లాంట్ కోసం పార్లమెంటులో ఏం చేశారని నిలదీశారు. స్టీల్ ప్లాంట్ కేవలం శంకుస్థాపనలకే పరిమితమయిందని అన్నారు. ఇది శంకుస్థాపనల ఫ్యాక్టరీగా, టెంకాయలు కొట్టే ప్రాజెక్ట్ గా మారిందని చెప్పారు. 'చేయాలి చెల్లి పెళ్లి మళ్లీ మళ్లీ' అన్నట్టుగా తయారయిందని ఎద్దేవా చేశారు. మీడియా ముందు టెంకాయలు కొట్టి నిరసన వ్యక్తం చేశారు.

# 11 నెలల కాలంలో 42 మంది విద్యార్థులు మృతి.. రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ హరీశ్‌రావు



హైదరాబాద్ : రేవంత్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తంగా మారాయి. ఫుడ్ పాయిజన్, పాముకాట్లతో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా కేతెపల్లి మండల పరిధిలోని బీసీ గురుకులంలో ఓ విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. నల్లగొండ జిల్లాలో పాము కాటుకు గురై మరో గురుకుల విద్యార్థి ఆసుపత్రి పాలైన వార్త తీవ్రంగా కలిచివేసింది. కాంగ్రెస్ పాలనలో బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన పిల్లలు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రుల్లో చేరుతుండడం సిగ్గుచేటు. గురుకులాల్లో కుక్కకాట్లు, ఎలుక కాట్లు, పాము కాట్లు సాధారణంగా మారడం దురదృష్టకరం. విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు తన వద్దనే ఉన్నా ముఖ్యమంత్రి ఏనాడు సమీక్ష చేయడని హరీశ్‌రావు మండిపడ్డారు. పురుగులన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటించినా పట్టించుకోడు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రుల పాలైన పట్టించుకోడు. టీచర్లు కావాలంటూ విద్యార్థులు రోడ్డెక్కినా పట్టించుకోడు. పాముకాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాకులతో ఆసుపత్రుల పాలైనా పట్టించుకోడు. మీ 11నెలల కాలంలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి అని ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోడు. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం ఖరీదు 42 మంది విద్యార్థుల ప్రాణాలు. విద్యాశాఖ ప్రక్షాళన అంటూ ప్రగల్భాలు పలకడం కాదు రేవంత్ రెడ్డి.. గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, విద్యాబోధన జరిగేలా చూడండి. అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలు కాపాడండి అని హరీశ్‌రావు కోరారు.

# డబ్బుల్లేవు.. కానీ ఆలోచనలున్నాయి.. నా జీవిత ఆశయం అదే

మొదటి పేజి తరువాయి



413 రోజుల రికార్డ్ టైమ్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపడితే దాన్ని కాపాడుకోవడం తెలీలేదని గత ప్రభుత్వాన్ని విమర్శించారు.. 28 సార్లు నేరుగా ప్రాజెక్ట్‌ను సందర్శించా.. 80సార్లు రివ్యూ చేశా.. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగిఉంటే పోలవరం ప్రాజెక్టు 2021లోనే ప్రాజెక్ట్ పూర్తయ్యేదని చెప్పారు సీఎం చంద్రబాబు.. రివర్స్ టెండరింగ్‌తో మొత్తం ధ్వంసం చేశారని, అవగాహన లేని మంత్రుల చేతిలో పడి ప్రాజెక్టు వెనక్కు వెళ్లిందని, తాము అధికారంలోకి వచ్చాక మళ్లీ పట్టాలెక్కిందని చెప్పారు. జనవరి నుంచి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ప్రారంభిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో 2027కల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని మాటిచ్చారు చంద్రబాబు. నదుల అనుసంధానం పూర్తి చేయాలనేది నా జీవిత ఆశయం.. ఇందుకోసం 70వేల కోట్లు ఖర్చవుతుంది.. మన దగ్గర డబ్బుల్లేవు కానీ ఆలోచనలున్నాయి.. మంత్ర దండాల్లేవు.. తెలివితేటలే ఉంటాయి.. అన్నారు. అటు.. రోడ్ల నిర్మాణం విషయంలో కూడా వినూత్న ఆలోచన అమల్లో పెట్టబోతోంది కూటమి సర్కార్. రోడ్ల నిర్మాణ కాంట్రాక్ట్‌ను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తామని, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ పైలెట్ ప్రాజెక్ట్ మొదలౌతుందని చెప్పారు. అంతకుముందు సాగునీటి ప్రాజెక్టులపై ఏపీ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో కూడా చర్చ జరిగింది. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని మొట్టమొదట ఆలోచన చేసింది ఎన్టీఆరేనని, ఆ తర్వాత రాయలసీమ ప్రాజెక్ట్‌ల పునరుజ్జీవానికి చంద్రబాబు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు కాల్వ శ్రీనివాసులు. ఈ సందర్భంగా హంద్రీనీవా కాలువల విస్తరణపై సభ దృష్టికి తీసుకెళ్లారు సభ్యులు. త్వరలోనే పనులు చేపడతామన్నారు మంత్రి నిమ్మల. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ అంశం అసెంబ్లీలో ప్రస్తావనకొచ్చింది. రిటైర్డ్ అధికారి పీవీ రమేష్ వాంగ్మూలాన్ని తప్పుదారి పట్టించి, కుట్ర పూరితంగానే అరెస్ట్ చేశారని గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. చంద్రబాబు అరెస్ట్ కోసం కొన్ని కీలక ఫైల్స్ మాయం చేశారంటూ పీవీ రమేష్ ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల బదిలీల అంశం ప్రశ్నోత్తరాల్లో ప్రస్తావనకు వచ్చింది. ఉద్యోగుల వన్‌టైమ్ రిలీవ్ కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి సమాధానం రావల్సి ఉందన్నారు ఆర్థికమంత్రి పయ్యావుల. ఒక వెయ్యి 942 మంది ఏపీ ఉద్యోగులు తెలంగాణకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారని, ఒక వెయ్యి 447 మంది తెలంగాణ ఉద్యోగులు ఏపీకి రావాలనుకుంటున్నారని చెప్పారు. రెండురాష్ట్రాల మధ్య పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతర్రాష్ట్ర ఉద్యోగుల వ్యవహారం, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్, వివిధ శాఖలకు సంబంధించిన గ్రాంట్లు, డిమాండ్లపై మంగళవారం నాటి అసెంబ్లీలో చర్చ జరిగింది. కోఆపరేటివ్ సొసైటీస్.. ఎక్సైజ్.. ప్రొహిబిషన్ చట్టాలకు సవరణలు కూడా జరిగాయి. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుపై జరిగిన చర్చలో సీఎం చంద్రబాబు ఇచ్చిన క్లారిటీ అసెంబ్లీ సమావేశాల్లో హైలైట్..

# కేసీఆర్ అనే మొక్కను ఇక తెలంగాణ గడ్డపై మొలవనివ్వను..

మొదటి పేజి తరువాయి



పడుకొని ఏం కుట్రలు చేస్తున్నావో నాకు తెలియదనుకుంటున్నావా అంటూ ఘాటుగా హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ అనే మొక్కను ఇక తెలంగాణ గడ్డపై మొలవనివ్వనని రేవంత్ రెడ్డి శపథం చేశారు. దమ్ముంటే రా.. అసెంబ్లీలో చర్చ పెడదాం డేట్ నువ్వు చెప్పినా సరే %-% నన్ను చెప్పమన్నా సరే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ సభ లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలో తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా విజయోత్సవ శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ. సెంటిమెంట్‌గా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ మాజీ సీఎం కేసిఆర్‌పై విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను తొక్కుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుకుంటూ వచ్చి సీఎం కుర్చీ లాక్కున్నా.. ఇక తెలంగాణ గడ్డపై కేసీఆర్ అనే మొక్కను మొలవనివ్వను అంటూ సీఎం రేవంత్ రెడ్డి శపథం చేశారు. ఫామ్ హౌజ్ లో పడుకుని ఎలాంటి కుట్రలు చేస్తున్నారో తెలుసని అన్నారు. తేదీ నువ్వు చెప్పినా సరే నన్ను చెప్పమన్నా సరే అసెంబ్లీకి రా చర్చ పెడదాం.. దమ్ముంటే అసెంబ్లీ కి రా అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు రేవంత్ రెడ్డి. బిల్లా %-% రంగ అసెంబ్లీలో చర్చిద్దాం రండి.. అభివృద్ధిని అడ్డుకుని ఎవరైనా కుట్రలు కుతంత్రాలు చేస్తే, జైలులో పెట్టి ఊచలు లెక్క పెట్టిస్తా అంటూ పరోక్షంగా బీఆర్ఎస్ ముఖ్యనేతలను హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి. అదే రేంజ్‌లో తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డిపై కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణకు అడ్డుపడ్డ మోదీకి ఊడిగం చేస్తున్న కిషన్ రెడ్డి, గుజరాత్‌కు గులాంగిరి చేస్తున్నాడని ఆరోపించారు. తట్టా బుట్టా సర్దుకుని గుజరాత్‌కి వెళ్లి గులాంగిరి చేసుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పదినెలల్లో 22లక్షల రైతు కుటుంబాలకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు సీఎం. ఆనాడు భద్రకాళీ, సమ్మక్క సారక్క అమ్మవార్ల సాక్షిగా చెప్పా.. పంద్రాగస్టులోగా రుణమాఫీ చేసి తీరుతామని.. మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నామన్నారు. ఓరుగల్లు వేదికగా మాట ఇస్తున్నా.. మిగిలిన అందరికీ రుణమాఫీ చేసే బాధ్యత మాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మాట ఇస్తే తల తెగిపడినా మడమ తిప్పని నైజం కాంగ్రెస్ ది అని పునర్ఘాటించారు. రాష్ట్రంలో 66 లక్షల 1కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతులు పండించారు. దేశంలో ఎక్కడా ఇంత వరకు ఏ రాష్ట్రంలో ఈ స్థాయిలో వరి ధాన్యం పండిచలేదని వెల్లడించారు

# చంద్రబాబులో ఎప్పటికీ మార్పురాదు : వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు

మొదటి పేజి తరువాయి

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అబద్ధాలనే నిజాలుగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హామీలు అమలు చేయలేకనే చంద్రబాబు బడ్జెట్‌ను ఆలస్యం చేశారని విమర్శించారు. బడ్జెట్‌ను ప్రవేశపెడితే రాష్ట్రానికి ఉన్న అప్పులను చూపించవలసి ఉంటుందన్నారు. అప్పుల విషయంలో చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు ఎల్లో మీడియా తోడైందని మండిపడ్డారు. కాగ్ రిపోర్ట్‌పై కూడా చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారన్నారు. చంద్రబాబును బొంకుల బాబు అని ఎందుకు అనకూడదని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు దిగిపోయే నాటికే పరిమితికి మించి అప్పులు చేశారని, ఆరోగ్యశ్రీ సహా వివిధ బకాయిలు ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు హయాంలో 19 శాతం అప్పులు పెరిగితే, తమ హయాంలో 15 శాతం మాత్రమే పెరిగాయన్నారు. వైసీపీ అధికంగా అప్పులు చేసిందని చంద్రబాబు చెబుతున్నారని, కానీ ఇందులో రెండేళ్లు కరోనా కాలం ఉందని గుర్తు చేశారు. చంద్రబాబు ఏం చెప్పినా వక్రీకరనే ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని తాము రూ.25 లక్షలకు పెంచామన్నారు. తమ హయాంలో చేసిన పనులను కూడా చంద్రబాబు టీడీపీ హయాంలో చేసినట్లుగా చెప్పుకుంటున్నారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ కింద తాము ఖర్చు చేసిన రూ.3,762 కోట్లను తమ హయాంలో ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం కింద ఖర్చు చేసినట్లు చూపించుకున్నారని ఆరోపించారు.ముఖ్యంగా వైసీపీ హయాంలో అప్పులపై తప్పుడు ప్రచారం చేసి దొరికిపోయిన ప్రభుత్వం.. ఇప్పుడు కాగ్ రిపోర్టుపైనా అవాస్తవాల్ని ప్రచారం చేస్తోందన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేయలేక బడ్జెట్ లో వాటికి కేటాయింపులు చేయలేక తప్పించుకుందని జగన్ ఆరోపించారు. అసెంబ్లీలో తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలకు నిధుల కేటాయింపు చేయకుండా చంద్రబాబు తప్పించుకున్నారని జగన్ ఆరోపించారు. అంతటితో ఆగకుండా తమ హయాంపై కాగ్ రిపోర్టు వస్తే దానిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వ అప్పులపై తప్పుడు ప్రచారం చేశారని, ఇప్పుడు వాటిని నిరూపించలేక మాట మారుస్తున్నారని జగన్ ఆక్షేపించారు. బడ్జెట్ లో ఉచిత గ్యాస్ సిలెండర్ల వంటి చిన్న చిన్న పథకాలకు సైతం నిధులు కేటాయించలేని పరిస్థితుల్లో చంద్రబాబు ప్రభుత్వం ఉందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం బడ్జెట్ లో ఉచిత సిలెండర్లకు కేటాయించిన నిధులతో మూడు సిలెండర్లు ఉచితంగా ఎలా ఇస్తారన ప్రశ్నించారు. అలాగే బడ్జెట్ లో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆరోగ్య శ్రీ పథకం పేరు మార్చి తామేమ అమలు చేసినట్లు చెప్పుకుంటున్నారని జగన్ ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే సచివాలయాల్లో లక్షా 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, 50 వేల ఆర్టీసీ కార్మికుల్ని ప్రభుత్వంలోకి తీసుకున్నామని, 2.66 లక్షల వాలంటీర్లను నియమించామని, కానీ కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక్క ఉద్యోగం కల్పించలేదన్నారు. మెగా డీఎస్సీ పేరుతో గతంలో తాము ఇచ్చిన ఉద్యోగాల్ని సైతం భర్తీ చేయలేని పరిస్థితుల్లో ఉందన్నారు. అంతే కాదు తాము నియమించిన వాలంటీర్లను తొలగిస్తున్నారని జగన్ విమర్శించారు. తమ హయాంలో ఆరోగ్య శ్రీలో వైద్యం చేయించుకునే మొత్తం 25 లక్షలకు పెంచామని, కానీ ఇప్పుడు ప్రభుత్వం 108కే జీతాలివ్వడం లేదన్నారు. ఆరునెలలుగా ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్ లో ఉంచేశారన్నారు. పేదలకు గతంలో ఇంటి స్థలం, ఇళ్లు ఇవ్వని చంద్రబాబు, తాము ఇచ్చిన ఇళ్లు పూర్తయితే పేరు జగన్ కు వస్తుందని ఆపేశారన్నారు. ఎందుకు అసెంబ్లీ నడుపుతున్నారో, ఎందుకు ప్రభుత్వం నడుపుతున్నారో తెలియడం లేదన్నారు. ప్రజలకు అవసరమైన పనులన్నీ పక్కకు పోయాయన్నారు. రాష్ట్రమంతా మాఫియా ముఠాలు కనిపిస్తున్నాయన్నారు.

# చంద్రబాబు ఎఫెక్ట్..! ఇక రోడ్డెక్కితే బాదుడే?

అమరావతి : ఏపీలో రోడ్లను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని చూస్తోంది. వైసీపీ హయాంలో అయిదేళ్ల పాటు రోడ్లకు గుంతలు పడి అధ్వాన్నంగా మారాయి. ఈ రోడ్ల మీద ఎన్ని సెటైర్లు, ఎన్నెన్ని విమర్శలు ఎన్నెన్ని జోకులు అయినా రోడ్లు అలాగే ఉన్నాయి. ఒక విధంగా కూటమి అధికారంలోకి రావడానికి వైసీపీ ఓటమికి పాడైన రోడ్లు కూడా కీలక పాత్ర పోషించాయి. కూటమి ప్రభుత్వంలో రోడ్లు కూడా అలాగే ఉన్నాయి. మొత్తం రోడ్లను బాగు చేయించాలీ అంటే ఖజానాలో సొమ్ములు లేవు. దాంతో గుంతలు పూడ్చడానికి అన్నట్లుగా 850 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ పనులు సాగుతున్నాయి. అయితే ఇవి సరిపోవని అంటున్నారు. ఏపీ రోడ్లు నిర్మించాలంటే వేల కోట్లు ఖర్చు అవుతాయి. అందుకే చంద్రబాబు తన పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలతో ఒక ప్రతిపాదన పెట్టారు. ఏపీలోని రోడ్లను అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలకు ఇద్దామన్నది ఆ ప్రతిపాదన. ఆ విధంగా చేస్తే కనుక రోడ్లు బంగారంగా తయారు అవుతాయి. అయితే టోల్ ఫీజు చెల్లించాలి. కానీ ఇది కూడా కార్లు బస్సులు కార్లు వంటి వాహనాలే పరిమితం చేద్దామని చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారు. ఇక బైకులు ట్రక్కులు, ట్రాక్టర్లు ఆటోలకు టోల్ ఫీజు ఉండదని చెబుతున్నారు. అంతే కాదు గ్రామాలలో మండలాలలో అసలు టోల్ ఫీజు అన్నదే ఉండదని మరో మినహాయింపు ఇచ్చారు చంద్రబాబు. ఇది పైలెట్ ప్రాజెక్ట్ గా గోదావరి జిల్లాల నుంచే స్టార్ట్ చేద్దామని ఆయన అంటున్నారు. అయితే ఈ విషయంలో ప్రజలను ఒప్పించాల్సింది ప్రజా ప్రతినిధులే అని బాబు అన్నారు. ఇది సమ్మతం కాకపోతే తనకేమీ అభ్యంతరం లేదు అని మళ్ళీ గుంతల రోడ్ల మీదనే తిరగాల్సి ఉంటుందని ఆయన అంటున్నారు. టోల్ ఫీజు అంటే ప్రజలలో అసహనం కనిపిస్తుంది అని అంటున్నారు. బస్సులకు టోల్ ఫీజు వేసినా అందులో ప్రయాణించేది సామాన్యులే కదా అని అంటున్నారు. వారి టికెట్ మీదనే ఆ భారం పడుతుందని అంటున్నారు ఇక కార్లు ఈ రోజులలో మధ్యతరగతి వారికీ ఉన్నాయని చెబుతున్నారు. లారీలకు టోల్ ఫీజు పెడితే వారు కూడా నిరసనలు వ్యక్తం చేస్తారు అని అంటున్నారు. ఇది వర్కౌట్ అవుతుందా అన్నది ఆలోచించాల్సిందే అని అంటున్నారు.

# రేవంత్ స్పెషల్ ఫోకస్ - కీలక ప్రకటన..!!

మొదటి పేజి తరువాయి

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద శంఖుస్థాపన చేసారు. రూ.35.25 కోట్లతో చేపట్టే అన్నదానం సత్రం నిర్మాణ పనులు ప్రారంభించారు. జిల్లాలో పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, భూమి పూజలు చేయనున్నారు.

వరాల ప్రకటన

సీఎం రేవంత్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు వరాలు అందించారు. తొలి ఏడాది పాలనలో మొత్తం రూ.694.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టారు. ఈ రోజు పర్యటనలో సీఎం రేవంత్ రూ. 45 కోట్లతో చేపట్టే మూల వాగు బ్రిడ్జి నుంచి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా రూ. 166 కోట్లతో చేపట్టే వైద్య కళాశాల, హాస్టల్ బ్లాక్ నిర్మాణ పనులకు సీఎం భూమి పూజకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రూ.50 కోట్లతో నూలు డిపో నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నారు. రూ. 52 కోట్లతో కొనరావుపేట మండలంలో చేపట్టే హై లెవెల్ బ్రిడ్జి పనులు, రూ. 3 కోట్లతో నిర్మించే డ్రైన్ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయటం తో పాటుగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ఖరారు చేసారు.

వరుస ప్రారంభోత్సవాలు

ఇక, రూ.235 కోట్లతో 4696 మిడ్ మానేరు రిర్వాయర్ నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల పనులకు సీఎం రేవంత్ భూమి పూజ చేస్తారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న మేడిపల్లి మండలంలో జూనియర్ కళాశాల రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నారు. సిరిసిల్ల లో రూ. 26 కోట్లతో నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనం, వేములవాడలో రూ. కోటి 45 లక్షలతో నిర్మించిన జిల్లా గ్రంధాలయ భవనం, రూ. 4 కోట్ల 80 లక్షలతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ప్రారంభించ నున్నారు. 631 శివశక్తి మహిళా సంఘాలకు రూ.102 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును సీఎం రేవంత్ పంపిణీ చేయనున్నారు. గల్ఫ్ దేశాలలో మరణించిన 17 కుటుంబాలకు 85 లక్షల పరిహారం పంపిణీ చేయనున్నారు.

# కాంగ్రెస్ కీలక నిర్ణయం.. !!

మొదటి పేజి తరువాయి



లోక్‌సభ నియోజక వర్గానికీ ఉప ఎన్నిక నేడే జరుగుతోంది. కాంగ్రెస్ సిట్టింగ్ లోక్‌సభ సభ్యుడు వసంత్ రావ్ బల్వంత్ రావ్ చవాన్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అవసరమైంది. పాలక్కాడ్- కేరళ, ఛబ్బెవాల్- పంజాబ్, గిద్దర్‌బాహా- పంజాబ్, డేరా బాబా నానక్- పంజాబ్, బర్నాలా- పంజాబ్, ఘజియాబాద్- ఉత్తర ప్రదేశ్, మఝువాన్- ఉత్తర ప్రదేశ్, మీరాపూర్- ఉత్తర ప్రదేశ్, ఖైర్- ఉత్తర ప్రదేశ్, ఫూల్‌పూర్- ఉత్తర ప్రదేశ్, కుందార్కి- ఉత్తర ప్రదేశ్, కర్హాల్, కటేహారి- ఉత్తర ప్రదేశ్, కేదార్‌నాథ్- ఉత్తరాఖండ్ నియోజకవర్గాలకు ఉప ఎన్నిక కొనసాగుతోంది. ఆయా ఎన్నికల ఫలితాలు ఈ నెల 23వ తేదీన వెలువడతాయి. కాగా- పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై తాము నిర్వహించిన సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌పై తమ అంచనాలను వెల్లడించనున్నాయి. ఇదివరకు హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పెద్దగా వాస్తవ రూపాన్ని దాల్చని నేపథ్యంలో ఈ సారి ఎలా ఉంటాయనేది ఆసక్తి రేపుతోంది. కాగా- ఈ పరిణామాల మధ్య అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఎగ్జిట్ పోల్స్ సందర్భంగా టీవీ ఛానళ్లు, వివిధ మీడియా సంస్థలు నిర్వహించబోయే డిబేట్లల్లో పాల్గొనకూడదని నిర్ణయించింది. ఈ చర్చల్లో పార్టీ తరఫున ఎవ్వరూ పాల్గొనకూడదని ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా పాల్గొంటే అది వారి వ్యక్తిగత అభిప్రాయమౌతుందని పేర్కొంది. టీవీ ఛానళ్లు తమ టీఆర్పీ రేటింగ్స్‌ను పెంచుకోవడానికి ఇలాంటి డిబేట్లను పెడుతుంటాయని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతోంది. ఈ ఏడాది ముగిసిన లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌కు కూడా కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రజా తీర్పు ఈవీఎంలల్లో నిక్షిప్తమైందని, రాజెవరో, బంటెవరో ఓట్ల లెక్కింపులో తేలుతుందని పేర్కొంది.

## ఘనంగా ముగిసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



యాడికి నవంబర్ 20 మండల రిపోర్టర్-బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించబడినది.ఈ సందర్భంగా సరస్వతి చిత్రపటానికి ముఖ్య అతిథి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి చే పూలమాల వేసి మరియు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న వారు ఉపాధ్యాయులు కొత్త రాయుడు మరియు శివయ్య పాల్గొన్నారు.సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని, దేవాలయాలనీ, నిత్యము మనము గ్రంథాలయాలకు వెళ్లి చదువుకోవాలన్నారు.అదేవిధంగా ఉపాధ్యాయుడు కొత్త రాయుడు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకుని పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం మంచి లక్షణంగా ఆయన పిల్లలకు సూచించడం జరిగింది. ఉపాధ్యాయులు కొత్త రాయుడు నలుగురు మందికి గ్రంథాలయ సభ్యత్వం ఇవ్వడం జరిగింది. అలాగే బహుమతుల ప్రధాన కార్యక్రమంలో వ్యాస రూప పరీక్ష కాంపిటీషన్ లో మొదటి బహుమతి హర్షియా, రెండో బహుమతి హరిణి, డ్రాయింగ్ కాంపిటీషన్లో మొదటి బహుమతి స్ఫూర్తి, రెండో బహుమతి మానస గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం మధుసూదన్, గ్రంథాలయ సిబ్బంది వినయ్ కుమార్, గ్రంథాలయ పాఠకులు రాజేష్, శ్రీనివాసులు , లక్ష్మీనారాయణ ,రాజశేఖర్ ,తరుణ్ చాంద్, రాహుల్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమం జయప్రదం చేయడం జరిగినది.ఈ విధంగా గ్రంథాలయ వారోత్సవాలు చాలా ఘనంగా ముగించడం జరిగిందని గ్రంథాలయ అధికారి మధుసూదన్ తెలియజేశారు.


## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు

- ప్రతి ఇంటి లెక్క పక్కాగా..



రెంటచింతల, మండల రిపోర్టర్-శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : గత వైకాపా ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చినా ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించలేదు. అనేక గృహాల వివరాలను పూర్తిగా నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో చాలామంది అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైంది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి ఇంటిని జియోట్యాగింగ్ చేసి కుటుంబ వివరాల నమోదుకు సర్వే చేపడుతోంది. సచివాలయం సిబ్బంది క్లస్టర్ పరిధిలో సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు ఆరా తీస్తున్నారు. ఇల్లు, కుటుంబ యజమాని లేదా సభ్యుల్లో ఒకరి నుంచి ధ్రువీకరణ నిమిత్తం వేలిముద్ర లేదా ఐరిస్ తీసుకొని యాప్ లో అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో త్వరితగతిన పూర్తి చేయడానికి మండలాల్లో ఎంపీడీవోలకు ప్రభుత్వం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో రెంటచింతల మండలంలో ఇప్పటివరకు 70% పూర్తయింది. జిల్లాలోని 28 మండలాల్లో రెంటచింతల మండలం సర్వే ప్రక్రియలో ద్వితీయ స్థానంలో ఉంది.

## గుత్తి వారి నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న గొర్రెపాటి, దారపనేని




ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్):కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని బాలాజీ జ్యువెలర్స్ అధినేత గుత్తి వెంకటరాజా ధర్మపత్ని బుజ్జమ్మ దంపతుల ఏకైక కుమారుడు గుత్తి అనిల్ కుమార్, కొత్తపట్నం వాస్తవ్యులు సుంకరి రాంబాబు ధర్మపత్ని అంజలి దంపతుల కుమార్తె లక్ష్మి యశస్విని ల నిశ్చితార్థ వేడుకలు ఒంగోలు పట్టణంలోని విష్ణు ప్రియ కన్వెన్షన్ హాల్ లో బుధవారం అంగరంగ వైభవంగా



నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకలలో పలువురు ప్రముఖులు గొర్రెపాటి శ్రీనివాసరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, కనిగిరి నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ కొండిశెట్టి వెంకటరమణయ్య,ఉప్పలపాటి హరిబాబు, సి ఎస్ పురం మాజీ సింగల్ విండో అధ్యక్షులు బోయిల్ల నారాయణరెడ్డి, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య, పామూరు ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, పోతురాజు వెంకటరత్నం, పాలపర్తి వెంకటేశ్వర్లు, గద్దె సుధాకర్ దంపతులు మేనమామ చలివేంద్రం సుబ్బారావు దంపతులు, తమ్ముడు పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య దంపతులు, ఓగూరి నరసింహారావు, వరికూటి చిరంజీవి బ్రదర్స్, ఆళ్లగడ్డ నరసింహులు, డివి పాలెం చిన్న హజరత్ ,గుత్తి వారి కుటుంబ సభ్యులు, సుంకరి వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## గుత్తి అనిల్ నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న ఉప్పలపాటి, పందిటి, కొండిశెట్టి, పాలపర్తి



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణానికి చెందిన టిడిపి నాయకులు ,బాలాజీ జ్యువెలరీస్ అధినేత గుత్తి వెంకటరాజా ఏకైక కుమారుడు గుత్తి అనిల్ కుమార్, యశస్వినిల నిశ్చితార్థ వేడుకలు ఒంగోలు పట్టణంలోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాల్లో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, పాలపర్తి రమణయ్య, సోమిశెట్టి శ్రీనివాసులు, బిజెపి నాయకులు కొండిశెట్టి రమణయ్య. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.


## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు! విద్యార్థులకు బహుమతి ప్రధానం!!





టంగుటూరు మండల రిపోర్టర్ - వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక గ్రంథాలయ ఆవరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు పలువురి ప్రముఖుల సమక్షంలో బహుమతి ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు మాజీ ఎంపీపీ చదలవా డ చంద్రశేఖర్ టిడిపి సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు టిడిపి మండల అధ్యక్షులు కామని విజయ్ కుమార్ సర్పంచ్ మధిరాల మమత ఎంఈఓ తన్నీరు బాలాజీ మాజీ ఐ ఆర్ ఎస్ సెల్వన్ రాజు స్థానిక శాతవాహన హైస్కూల్ డైరెక్టర్ శ్రీమతి రావూరి కల్పన లిటిల్ ఏంజిల్స్ విద్యాలయ కస్పాండెంట్ శ్రీమతి తోకల భారతి గ్రంథాలయ నిర్వాహకులు గుమ్మడి వర్ధన్ రాజు వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## అయ్యప్ప స్వామి దీక్షను స్వీకరించిన ప్రకాశం జిల్లా యూత్ జాయింట్ సెక్రెటరీ ముల్లంగి రవీంద్రారెడ్డి



కనిగిరి, రిపోర్టర్ జి.ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): హర హర క్షేత్రం ఒంగోలు మంగమూరు రోడ్డు లో కొలువుదీరిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి దేవస్థానం నందు ప్రకాశం జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ ముల్లంగి రవీందర్ రెడ్డి శ్రీ పండితారాధ్య శతాధిక ప్రతిష్టాపన ఆచార్య లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీ పరాం కుశం కేశవాచార్యులు గారి ఆశీర్వాదంతో పరాంకుశం చక్రవర్తి గారి అధ్యక్షతన పరాంకుశం రంగా చార్యులు గురువుగారి ఆశీర్వాదంతో శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి వారి దీక్షను స్వీకరించారు.

## ఉండవల్లి శ్రీదేవికి శుభాకాంక్షలు తెలిపిన కోడిగుంపల నాయబ్ రసూల్



ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్):మాజీ శాసనసభ్యురాలు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని మంగళగిరి టిడిపి కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ రాజకీయ నాయకులు,రాజకీయ వ్యూహ కర్త కోడిగుంపల నాయబ్ రసూల్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన కనిగిరి ప్రాంతంలోని మాదిగ సోదరుల అభివృద్ధికి మాదిగ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా అండగా నిలిచి సహకరించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తానని ఆమె తెలిపినట్లు కోడిగుంపల అన్నారు.

## వరసిద్ధి వినాయకుని సన్నిధిలో యారవ ప్రత్యేక పూజలు



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): చిత్తూరు జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కనిగిరి నియోజకవర్గం పామూరు టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు, గుత్తి మహేష్, టిడిపి సీనియర్ నాయకులు పాలపర్తి రమణయ్య, పోలు బాల గురువారెడ్డి , వేముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుని కలసిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరిలో అభివృద్ధి పనులు గురుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిఅందజేశారు.ఐఐటి కాలేజ్ ఏర్పాటుకు సహకారం, కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టాలని, కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ విధానం గురుంచి సీఎం చంద్రబాబుకి వివరించారు.ముఖ్యమంత్రిచంద్రబాబు సానుకూలంగా స్పందించి కేఎంసీ విధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు.రాష్ట్రంలో తొలి రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కనిగిరిలో ఏర్పాటుపై సీఎం చంద్రబాబుకి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గద్దె ఏడుకొండలు దంపతులు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ గావించిన ప్రముఖ వైద్యులు గద్దె ఏడుకొండలు దంపతులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు సాయి త్రినాథ్ పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప స్వామి కి ప్రత్యేక పూజలు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపండి : నర్సింగ్ సాంబయ్య



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : పామూరు పట్టణంలోని కనిగిరి రోడ్డు నందు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు నెలరోజుల నుంచి మంచినీళ్లు ప్లాంట్ (ఆర్ఓ ప్లాంట్) రిపేరు వచ్చింది చైర్మన్ గుత్తి కొండయ్య పై అధికారులకు సమస్యని ఎన్నిసార్లు తీసుకువెళ్లిన వాళ్ళు ఎటువంటి స్పందన ఇవ్వకపోవడం చాలా బాధ కలిగిస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు అధికారులు తొందరగా స్పందించి పిల్లలకు తాగునీటి సమస్య లేకుండా చేయాలని చైర్మన్ గుత్తికొండయ్య కోరారు త్రాగునీరు లేక పిల్లలు రోడ్డు వెంబడి ఉన్న షాపులలో కొనుక్కుని వచ్చి తాగుతున్నారు ఈ సమస్యని అతి త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నర్సింగ్ సాంబయ్య మరియు పిల్లలు ఉన్నారు.

## కోనంకి రమణయ్య ను పరామర్శించిన - కనిగిరి వైసిపి ఇన్చార్జి దద్దాల



కనిగిరి, రిపోర్టర్ జి ప్రసాద్, (శుభోదయం న్యూస్): కనిగిరి మండలం పునుగోడు పంచాయతీకి చెందిన కోనంకి రమణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎడమ కాలు కోల్పోయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, సీనియర్ నాయకులు ఆదినారాయణ రెడ్డి,లక్కిరెడ్డి హనుమారెడ్డి, పొనుగోడు సర్పంచ్ తిమ్మయ్య, వెలిగండ్ల సీనియర్ నాయకులు పల్నాటి భాస్కర్ రెడ్డి, గొబ్బెల్ల శ్రీను,కొండారెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిట్రగుంట లో రైల్వే పరిశ్రమను ఏర్పాటు చేయండి..

- జనరల్ మేనేజర్ కు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుల వినతి



బిట్రగుంట: (శుభోదయం న్యూస్) : బిట్రగుంట లో రైల్వే సంబంధించిన ఏదో ఒక పరిశ్రమ ఏర్పాటు చేసి బిట్రగుంటకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కృషి చేయాలని నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు వినతి పత్రం అందించారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూచనల మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిట్రగుంట పూర్వ వైభవానికి చిహ్నంగా బిట్రగుంట లోకో షెడ్ చిత్రపటాన్ని జనరల్ మేనేజర్ వారికి అందజేసి బిట్రగుంట పూర్వ వైభవం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని దానికి సంబంధించి బిట్రగుంటలో ఏదో



ఒక రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేయాలని అలాగే బిట్రగుంట నుండి తిరుపతికి మెమోరైలు ఏర్పాటు చేయాలని. కోరారు.నేటికీ దక్షిణ మధ్య రైల్వే లో బిట్రగుంట ప్రత్యేక స్థానం ఉందని జిఎం అన్నారు. భవిష్యత్తులో బిట్రగుంట పూర్వ వైభవం వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ నేతలు షేక్ నూరుద్దీన్, మెతుకు రాజేశ్వరి, %ూని% భాగ్యరాజ్, ఆరోగ్యరాజ్, తుమ్మల వెంకయ్య నూకసాని శ్రీనివాసులు,పులివెందుల గోవిందరాజులు, బత్తుల రవిచంద్ర షేక్ జహీర్ బంక రాజన్న, విజయ్ రాజు, సుభాని తదితరులు పాల్గొన్నారు

## రీ సర్వేలో లోపాలను సవరించండి



బిట్రగుంట: (శుభోదయం న్యూస్) : గతప్రభుత్వహయాంలోరెవిన్యూ శాఖనిర్వహించిన భూసర్వేలోతలెత్తినలోపాలనుసవరించాలని, ప్రజా విజ్ఞప్తులదినంలోవచ్చినఅర్జీలకుసత్వరపరిష్కారంచూపాలని, జిల్లా బీసీఅడ్వకేట్ అసోసియేషన్ కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్యబుధవారం తాసిల్దార్ మలిశెట్టిసురేష్ బాబుకు విజ్ఞప్తిచేశారు. అధికారులున్యాయంచేస్తారనేఆశతో ప్రజావిజ్ఞప్తుల దినంనాడు అధికారులకు అర్జీలుసమర్పిస్తున్నారని, వీలైనంతత్వరగా అర్జీలకుపరిష్కారంచూపించి పేదప్రజలకున్యాయంచేయాలన్నారు. పై కార్యక్రమంలోఆయనతోపాటుకొండలరావు విశ్రాంతఉద్యోగి వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

## ఇనుప గేటు ను ఏర్పాటుచేసిన ఆలయ సిబ్బంది



ప్రకాశం జిల్లా బ్యూరో – చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ మదన వేణుగోపాలస్వామి, శ్రీ వల్లీ సమేత భుజంగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించిన (బంగారు షాపుల వీధి లోని) కాళీ స్థలానికి ఇనుప గేటు ఏర్పాటు చేసిన ఆలయ సిబ్బంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా ఇనుప గేట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి..




చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు(శుభోదయం న్యూస్): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలని సీపీఐ ఇన్‌చార్జి ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, చిలకలూరిపేట శాఖ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యుటీ సగం జీతం పెన్షన్ గా ఇవ్వాలని,విధి నిర్వహణలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వాహనాలతో చెత్తను తరలించాలంటే కష్టంగా ఉందని, మహిళా పారిశుధ్య కార్మికులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించటం లేదన్నారు. దీర్ఘకాలంగా నెలకొన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సబ్బులు నూనె డబ్బాలు, చెప్పులు బ్లౌజులు అందించాలని, పర్మినెంట్ వర్కర్లకు ఆదివారం సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చెంచయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, కార్మికసంఘం నాయకులు అక్కులయ్య, జయరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా రూ.7 వేల కోట్ల దోపిడీ జరిగింది : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): వైసీపీ ప్రభుత్వ హయాంలో పేటలో ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూసేకరణలో భారీ అవినీతి జరిగిందని, ఈ స్కామ్ లో మాజీ మంత్రి విడదల రజిని పాత్ర ఉందని, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. పేట పట్టణంలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు, ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూసేకరణలో విడదల రజిని భారీ కుంభకోణానికి పాల్పడటం జరిగిందని తెలిపారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం, ఆమె వల్ల నష్టపోయిన రైతులు గొడవ చేయడంతో, విడదల రజిని కొంతమందికి తిరిగి డబ్బులు చెల్లించి సెటిల్మెంట్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్ లో విడదల రజిని పాత్రను ఆధారాలతో సహా నిరూపిస్తామని ప్రత్తిపాటి పుల్లారావు సవాల్ విసిరారు. చిలకలూరిపేటలో జరిగిన విధంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పేరుతో జరిపిన భూసేకరణలో దాదాపు 7 వేల కోట్ల దోపిడీ జరిగిందని ప్రత్తిపాటి పుల్లారావు తెలియజేశారు. నివాసానికి పనికిరాని భూములను, ముంపు భూములను లక్షలు పెట్టి ప్రభుత్వం ద్వారా కొనిపించి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. జగన్ జమానాలో జరిగిన ఈ భారీ అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలని, లేదా సీఐడీతో గానీ,హౌస్ కమిటీతో గానీ సమగ్ర విచారణ జరిపి,దీని వెనుక ఉన్న వ్యక్తులందరినీ కఠినంగా శిక్షించాలని ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వాన్ని కోరారు.

## ఇంటి స్థలం కోసం క్యూ కట్టిన పేద ప్రజలు..

## సిపిఐ ఏరియా ఇన్చార్జి కార్యదర్శి తాళ్లూరు బాబురావు



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): పేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అహర్నిశలు పోరాటం చేస్తుందని సిపిఐ చిలకలూరిపేట ఏరియా ఇంచార్జ్ కార్యదర్శి తాళ్లూరు బాబురావు తెలిపారు. 21 వార్డులో ప్రజల నుంచి అర్జీలను సేకరించిన ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం స్థానిక సచివాలయంలో అందజేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగానే గత ప్రభుత్వం ఇచ్చినటువంటి ఇంటి స్థలం జీవించడానికి ఏమాత్రం సౌకర్యవంతంగా ఉండదని గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎమ్మెల్సీ శాసనమండలి విప్పు శ్రీ పిడుగు హరిప్రసాద్కు శుభాకాంక్షలు తెలిపిన అతికారికృష్ణ



సిద్ధవటం, మండలం రిపోర్టర్ – జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విప్పుగా జనసేన మొదటి ఎమ్మెల్సీ జనసేన పార్టీ మీడియా విభాగం హెడ్ శ్రీ పిడుగు హరిప్రసాద్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన రాజంపేట నియోజకవర్గం జనసేన యువ నాయకులు అధికారికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

## డిస్టిక్ లెవెల్ కాంపిటీషన్లో సత్తా చాటిన శ్రీ విద్యానికేతన్...!



సింగరాయకొండ మండల రిపోర్టర్ పసుమర్తి జాలయ్య( శుభోదయం న్యూస్):- సింగరాయకొండ లో విద్యానికేతన్ హై స్కూల్ నిన్న జరిగిన డివిజన్ లెవల్లో విజయం సాధించగా ఇవాళ ఒంగోలులో జరిగిన డిస్టిక్ లెవెల్ కాంపిటీషన్లో మొదటి స్థానం స్లొగన్స్ లో, సెకండ్ ప్లేస్ లోగో మేకింగ్, థర్డ్ ప్లేస్ ఎలాక్యూషన్ లో విద్యార్థులు విజయం సాధించారు. జిల్లా కలెక్టర్ తమీం అన్సరియా చేతులమీదుగా ప్రశంసా పత్రము అవార్డును తీసుకున్నారు. ఎస్ పి ఏ ఆర్ దామోదర్, జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ దేశభవితకు బాలల పురోగతి ప్రధానమని బాలబాలికలు వారి మధ్య అంతరాలను అసమానతలను అధిగమించి అని రంగాల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులు వారి హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో బంగారు బాల్యం ప్రతిజ్ఞను చేయించారు.

## వాలంటీర్లను వంచన చేసింది - గత వైసిపి ప్రభుత్వమే

## మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ధ్వజం



టంగుటూరు, మండల రిపోర్టర్ – వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : గత జగన్ ప్రభుత్వమే వాలంటీర్ వ్యవస్థను వంచన చేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ వార్డు గ్రామ సచివాలయాలు వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తరు. శాసనసభలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ అనేది ఉంటే కొనసాగించే వాళ్ళమని లేని వ్యవస్థను ఎలా కొనసాగిస్తామని ప్రశ్నించారు? 2023 ఆగస్టు వరకే కొనసాగిస్తు గత వైసిపి ప్రభుత్వం జీవో ఇచ్చిందని 2023 సెప్టెంబర్ లో వాలంటీర్లను కొనసాగిస్తూ జీవో ఇవ్వలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వం జీవో ఇచ్చి ఉంటే కొనసాగించి వేతనాలు పెంచే వాళ్ళమన్నారు. జీవోలు లేనందున ప్రస్తుతం వాలంటీర్ల వ్యవస్థ లేదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రివర్యులు పరిశీలించాలని చెప్పడం జరిగిందని ఆయన తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థ పై తమకు విశ్వాసం ఉందని మంత్రి వీరాంజనేయ స్వామి అన్నారు.

## పేకాట శిబిరం పై దాడి...!



సింగరాయకొండ మండల రిపోర్టర్ పసుమర్తి జాలయ్య( శుభోదయం న్యూస్ ):-పాత సింగరాయకొండ రైల్వే ట్రాక్ పక్కన పేకాట ఆడుతున్నటువంటి ఎనిమిది మంది వ్యక్తులను తదుపులోకి తీసుకోవడం జరిగింది వారి వద్ద 9005 రూపాయలు సీజ్ చేసిన సింగరాయకొండ పోలీసులు

## ఆ నలుగురు కార్యక్రమానికి చేయూతనిస్తున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ మరియు వేడుకాపుర ఫౌండేషన్



యాడికి నవంబర్ 20 మండల రిపోర్టర్-బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) మండల కేంద్రంలోని కోండ కింద వీధిలో నివాసముంటున్న లింగం లక్ష్మీదేవి (70) అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.మృతురాలికి ఒక కోడుకు మాత్రమే ఉండడం బంధువులు ఎవరు అంత్యక్రియలకు రాకపోవడంతో మృతురాలి కొడుకు లింగం ఓబులదాసు యాడికి మే ఐ హెల్ప్ యు మరియు వేడుకాపుర ఫౌండేషన్ ని సంప్రదించడం జరిగింది.విషయం తెలుసుకున్న వెంటనే ఫౌండేషన్ తరపున సభ్యులు వెళ్లి లింగం లక్ష్మీదేవి



అంత్యక్రియలను వారి సంప్రదాయ పద్ధతిలో లింగం లక్ష్మీదేవి ఇంటి వద్ద నుంచి కోన రోడ్డులోని స్మశానం వరకు పాడే మోసి పూర్తి చేయడం జరిగింది.అయినవాళ్లు దూరమైనా వారికి అంత్యక్రియలు చేయడానికి మనషులు లేని వారికి మీ మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ మరియు వేడుకాపుర ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సేవ ఎనలేనిదని అంత్యక్రియల కార్యక్రమం పూర్తి అయిన తర్వాత లక్ష్మీదేవి కొడుకు లింగం ఓబులదాసు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యుల బండారు బాలకృష్ణ ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, చందగాని దృవ నారాయణ, చింతా నరసింహ,సాకరే శంకరప్ప, గాంధీజీ స్కూల్ రామ మోహన్, కావలి సుధాకర్ (వెంకటాంపల్లి) పాల్గొనడం జరిగింది.

## గిరిజనుల సమస్యల పై గళం విప్పిన - కురుగొండ్ల



జిల్లా ప్రతినిధి సైదాపురం మండలం (శుభోదయం న్యూస్) : నెల్లూరు జిల్లా సైదాపురం మండలం మునగపాడు గ్రామంలో కొన్నేళ్లుగా రహదారి మార్గం లేక అక్కడి గిరిజనులు పడుతున్న ఆవేదనపై బుధవారం నాడు వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ తనదైన శైలిలో అసెంబ్లీ సాక్షి గా గళం విప్పారు.ఈ సందర్భంగా గిరిజనుల సమస్యపై కురుగొండ్ల మాట్లాడుతూ దాదాపు 1994 నుండి తెలుగుదేశం ప్రభుత్వంలో సైదాపురం మండలం మునగపాడు ఎస్టీ కాలనికి 70 ఇల్లు మంజూరు చెయ్యటం జరిగిందన్నారు,కానీ అక్కడ గిరిజనులు ప్రయాణించేందుకు సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర అవస్థలు పడుతున్న నేపథ్యంలో స్థానిక నాయకులు నా దృష్టికి తీసుకురావడం జరిగింది.దీనిపై పళ్ళు కోణాలలో విచారించగా అటవీ ఆధీనంలో రోడ్డు మార్గం ఉండడంతో ఆ ప్రాంతంలో రోడ్డు మార్గం వేయడానికి పలు అడ్డంకులు ఏర్పడడంతో ఇన్నేళ్లుగా రోడ్డు మార్గానికి పలు సమస్యలు ఎదురవుతూ వచ్చాయిఅని అన్నారు.దీనిపై ప్రభుత్వం స్పందించి అటవీ శాఖ అధికారులతో మాట్లాడి ఆ ప్రాంతంలో నూతన రోడ్డు నిర్మాణ పనులు కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారని కోరుకుంటున్నానమని అని ఆయన తెలియజేశారు.

## అమెరికా గ్లోబల్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన మౌలానా షరీఫ్





ప్రకాశం జిల్లా బ్యూరో – చంద్ర (శుభోదయం న్యూస్): అమెరికా గ్లోబల్ పీస్ యూనివర్సిటీ నుంచి అంతర్జాతీయ పీస్ గౌరవ డాక్టరేట్ పొందిన హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు మౌలానా షరీఫ్.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని, సర్వ మానవ సమానత్వం సౌభ్రాతృత్వం,సహనం, ఓర్పు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.

## పెదపూడి విజయ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు



సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య, (శుభోదయం న్యూస్):జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త పెదపూడి విజయ్ కుమార్ కు పార్టీ అధిష్ఠానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తాడేపల్లి లోని మాల కార్పొరేషన్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో సింగరాయకొండ మండల అధ్యక్షులు ఐనబత్తిన రాజేష్, జరుగుమల్లి మండల అధ్యక్షులు గూడ శశిభూషణ్ లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో వారి వెంట జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు ఉన్నారు.

## కోమళ్లపూడిలో షిరిడి సాయిబాబా మందిరం ప్రారంభోత్సవం



బుచ్చయ్యపేట,మండలంరిపోర్టర్ జి.శ్రీను (శుభోదయం న్యూస్): కోమళ్లపూడిలో షిరిడి సాయి విగ్రహ ప్రతిష్ట ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో బిఎన్ రోడ్డుని ఆనుకుని ఉన్న విశాలమైన ప్రదేశంలో అత్యంత సుందరంగా బాబా మందిరాన్ని నిర్మించారు.నూతనంగా నిర్మించిన శిరిడి సాయి మందిరాన్ని బుధవారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు.గత సోమవారం నుండి వేద పండితుల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా హెూమాధికములు నిర్వహిస్తున్నారు.బుధవారం ఎమ్మెల్యే రాజు ప్రత్యేకంగా సాయి నాధుడికి పూజలు జరిపి ఆలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది అన్నారు.బాబా మందిరాన్ని మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని పర్యాటక ఆధ్యాత్మిక ప్రదేశంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆలయాన్ని నిర్మించిన గేదెల సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా విశాఖ డెయిరీ కేంద్ర పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువతో సత్కరించి అభినందించారు.అనంతరం భక్తులకు అన్నదానాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గూనూరు మల్లు నాయుడు,పెదబాబు, ఎంపీపీ నాగేశ్వరి దేవి,జి. కోటేశ్వరరావు చోడవరం నియోజవర్గం నలుమూలల నుండి కూటమి నేతలు హాజరయ్యారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన.



బుచ్చయ్య పేట మండలం రిపోర్టర్ జి.శ్రీను (శుభోదయం న్యూస్): బంగారు మెట్టలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శంకుస్థాపన చేశారు.బంగారు మెట్ట, ఎల్బిపురం గ్రామాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అన్ని విధాలా తన సహకారం అందిస్తానని తెలిపారు.ఆధ్యాత్మిక ప్రదేశంగా తీర్చిదిద్దాలని సంఘ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు ముల్లు నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు జి కోటేశ్వరరావు,మాజీ సర్పంచ్ తమరాన దాసు,స్థానిక ఎంపీటీసీ యల్లపు జగ్గారావు,మాజీ ఎంపీటీసీ దొండా శ్రీను,వడ్డాది ఉప సర్పంచ్ దాడి సూరిబాబు, టిడిపి నేత సాయం శేషు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాకర్ల సురేష్ కి కృతజ్ఞతలు తెలియజేసిన పొదిలి రాము



కొండాపురం, మండల రిపోర్టర్ - అశోక్ (శుభోదయం న్యూస్): కృష్ణ బలిజ పూసల బీసీ సాధికార సమితి స్టేట్ మెంబర్ నెల్లూరు జిల్లా పూసల సంఘం కన్వీనర్ పొదిలి రాము మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండాపురం మండల పర్యటనలో కలిగిరి మండల పర్యటనలో అన్ని మండలాల పర్యటనలో ఇప్పటికీ మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాస్ కులాల వారికి స్థిర నివాసాలు లేవు చిన్న పూరిల్లులు చిన్న డేరా పట్టలు పైన వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్యక్షంగా చూశారు ఖచ్చితంగా మీకు న్యాయం చేస్తానని చెప్పారు అదే విధంగా బుధవారం అసెంబ్లీ సమావేశాలలో ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే శాసనసభ్యులు కాకర్ల సురేష్ మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ కమ్యూనిటీస్ వారికి మా నియోజకవర్గంలో 78 సంవత్సరాల స్వాతంత్ర్యంలో ఇప్పటికి సొంత స్థిర నివాసాలు లేవని తెలియజేశారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో మాటలాడినందుకు మాకు చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే శాసనసభ్యులు కాకర్ల సురేష్ కి మా తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు.

## రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రికి శుభాకాంక్షలు తెలియజేసిన గంజాం రాఘవేంద్ర



కొండాపురం, మండల రిపోర్టర్ - అశోక్ (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి సి సావిత్రిని విజయవాడ, గొల్లపూడి బీసీ భవనంలోని వారి కార్యాలయం నందు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, రాష్ట్ర రజక నాయకులు గంజాం రాఘవేంద్ర. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలి. - ఏఐఎస్ఎఫ్




మంచిర్యాల జిల్లా ప్రతినిధి - శ్రీనివాస్(శుభోదయం న్యూస్ ): - మంచిర్యాల జిల్లా:ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి అంబేద్కర్ చౌరస్తా వద్ద కళ్ళకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ బచ్చలి అభిరామ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలు సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించి కళాశాలలు నిరవధిక బంద్ చేయడం వల్ల విద్యార్థుల విలువైన సంవత్సరం కోల్పోతుందని ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటని విద్యార్థుల యాజమాన్యాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆనందమే కూటమి ప్రభుత్వం లక్ష్యం : యాగంటి మల్లికార్జున రావు



( మాచర్ల ప్రతినిధి: వేల్పుల చిన్న గురవయ్య (శుభోదయం న్యూస్ ):) అన్నం పెట్టే అన్నదాతలు ఆనందంగా ఉండాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లిఖార్జునరావు అన్నారు. మండల పరిధిలోని ధర్మవరం లో వేంచేసి ఉన్న శ్రీ హరిహర బాలనాగేంద్ర స్వామి 34వ వార్షిక మహోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండ్లలాగు పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా యాగంటి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకొవడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఇది రైతుల ప్రభుత్వం అని దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహాయ సహకారాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. రైతులు చెమటోడ్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలు కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి అండగా నిలబడిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నేరుగా రైతుల అకౌంట్ లోకి 20వేలు జమ అయ్యే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసిందన్నారు. పండ్ల తోటలకు 90/ సబ్సిడీ ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుర్గి లో ఏర్పాటు చేసిన మిర్చి యార్డులో రైతులు పండించిన మిర్చి పంటను కొనుగోలు చేసేవిధంగా కృషి చేస్తామన్నారు. ధర్మవరం మద్యలోనే ఆగిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల పంటపొలాలకు సాగునీరు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో దుర్భాకుల ప్రసాద్,కొండలు తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వృద్ధుడు ఆత్మహత్య



పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి (శుభోదయం న్యూస్) :మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటు చేసుకుంది.ఏఎస్సై సంగన్న కథనం మేరకు వివరాలు..తండాకు చెందిన పాల్త్య భద్యా (68)వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత ఏడాది నుండి మతిస్థిమితం కోల్పోయాడు.ఈక్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు.రాత్రి అయినా తిరిగి రాకపోయే సరికి కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు.రాత్రి సమయంలో తండా సమీపంలో వేప చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న భద్యా మృతదేహం కనిపించింది.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## సింగరేణిలో పదవి విరమణ పొందిన కార్మికులకు దీపావళి బోనస్

### లాభాల్లో వాటా ఇవ్వాలని కోరుతూ

### డైరెక్టర్ (పా) శ్రీ వెంకటేశ్వర రెడ్డికి వినతి పత్రం



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) : తేదీ 20-11-2024. రోజున తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గాని కార్మిక సంఘం(ఐ ఎఫ్ టీ యు) ఆధ్వర్యంలో సింగరేణిలో పనిచేసి పదవి విరమణ పొందిన కార్మికులకు రావలసిన లాభాల వాటా, దీపావళి బోనస్. ఇవ్వాలని కోరుతూ డైరెక్టర్ (ఫా) శ్రీ వెంకటేశ్వర రెడ్డి గారినీ ఇల్లందు గెస్ట్ హౌస్ లో కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో తెలంగాణ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐ ఎఫ్ టీ యు) గౌరవ అధ్యక్షులు టి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ కృష్ణ మాట్లాడుతూ సింగరేణి వార్షిక లాభాల్లో వాట ఇప్పటికే సర్వీస్ లో ఉన్న కార్మికులందరికీ పండగల ముందు చెల్లించారనీ. సర్వీసులో ఉన్న కార్మికులకు చెల్లించే ముందు రిటైర్డ్ కార్మికుల ను అస్సలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యనికి గురి చేస్తుందన్నారు. అన్ని విషయాలలో స్పందిస్తున్న సింగరేణి చైర్మన్ శ్రీ బలరాం నాయక్ గారు ఎలాంటి ప్రకటన ఇప్పటివరకు చేయలేదన్నారు. రిటైర్డ్ కార్మికులంతా 30-40 సంవత్సరాలు సింగరేణిలో పనిచేసి సింగరేణిలో ఉత్పత్తి లాభాలకు కారణమైన వారి సేవలను గుర్తించకుండా వారిని నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదన్నారు. సింగరేణి కంపెనీ నష్టాల్లో లేదని వేలకోట్ల లాభాలు వచ్చాయని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం ఒకవైపు ప్రచారం చేస్తుందనీ. కానీ రిటైర్డ్ కార్మికులకు చెల్లించేందుకు యాజమాన్యానికి మనసు ఎందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు వెంటనే సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు లాభాల వాటా దీపావళి బోనస్ వెంటనే చెల్లించే విధంగా ర్పాట్లు చేయాలనీ ఆ తేదీని ప్రకటించి రిటైర్డ్ కార్మికులందరికీ చెల్లించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు.దీనికి డైరెక్టర్ (పా) శ్రీ వెంకటేశ్వర రెడ్డి గారు స్పందిస్తూ త్వరలోనే వీరికి ఇచ్చే తేదీని ప్రకటిస్తామని త్వరలోనే రిటైర్డ్ కార్మికులకు లాభాల్లో వాట దీపావళి భవనస్సును ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది

## చలికాలంలో జాగ్రత్తలు పాటించండి : డాక్టర్ ప్రదీప్ రావు



పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి, (శుభోదయం న్యూస్): చలి తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మండల పరిధిలోని పొడిచన్ పల్లి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ప్రదీప్ రావు సూచించారు. బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో చిన్నపిల్లలు,వృద్ధులు బయటికి రావద్దని సూచించారు.చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఉన్ని వస్తువులు ధరించాలన్నారు. ఎవరైనా వ్యాధుల బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం

### పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్

### రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో సేకరించిన వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయడానికి పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ ఆదేశాల మేరకు సెంటెనరీ కాలనీ లోని మంథని జె ఎన్ టి యు ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సర్వే ఫారమ్ లో భర్తీ చేసిన వివరాలను ఆన్ లైన్ లో ఎలా నిక్షిప్తం చేయాలో జె ఎన్ టి



యు ఇంజనీరింగ్ కళశాలకు చెందిన 175 మంది విద్యార్థులకు హైదరాబాద్ లో శిక్షణ పొంది వచ్చిన రామగుండం నగర పాలక సంస్థ సిస్టమ్ మేనేజర్ సుధాకర్ డెమో ద్వారా కాలమ్ వారీగా వివరించగా సిస్టమ్ అసిస్టెంట్ శ్రావణ్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , కంప్యూటర్ ఆపరేటర్ యుగాంత్ సహకరించారు. ఆన్ లైన్ నమోదు ప్రక్రియ సమన్వయ అధికారులుగా రామగుండం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు , సూపరింటెండెంట్ ఆంజనేయులు , సీనియర్ అసిస్టెంట్ వసుధ, హెల్త్ అసిస్టెంట్ కిరణ్ , సీనియర్ అకౌంటెంట్ రవితేజ లను నియమించారు. సంబందిత వెబ్ సైట్ తెరుచుకున్న వెంటనే ఇప్పటివరకు పూర్తయిన సర్వే ద్వారా సేకరించిన వివరాలను జె ఎన్ టి యు ఇంజనీరింగ్ విద్యార్థుల సహకారంతో ఆన్ లైన్ నమోదు చేసే ప్రక్రియ వెంటనే ప్రారంభిస్తామని అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి, మంత్రులకు స్వాగతం పలికిన….. రామగుండం ఎమ్మెల్యే శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) : వేములవాడలో జరిగిన భారీ బహిరంగ సభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి,మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి ఉత్తమ్ కుమార్



రెడ్డిగారికి,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి, మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డికి, స్వాగతం పలికిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన సంబరాలు కాదు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువత కార్యదర్శి నాయికోటీ భాస్కర్



టేక్మాల్ మండలం రిపోర్టర్ కృష్ణ (శుభోదయం న్యూస్): కాంగ్రెస్ ప్రజా పాలన దినోత్సవాల సంబరాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు జరుపుకుంటుంది కానీ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను ముందు నెరవేర్చాలని మెదక్ జిల్లా బీఆర్ ఎస్ పార్టీ యువత కార్యదర్శి నాయికోటీ భాస్కర్ ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టేక్మాల్ మండల కేంద్రంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం అవుతున్నప్పటికీ ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను దాటవేస్తుందని అన్నారు, రైతులకు రుణమాఫీ, రైతుబంధు, నిరుపేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలతోనే పబ్బం గడుపుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టి నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజల ఆశలు నిరాశ చేయవద్దని అన్నారు. రైతులకు రైతు భరోసా పూర్తి రుణమాఫీ ఇవ్వకుండా ఎగనామం పెట్టాలని ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తుందని రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పిన రేవంత్ రెడ్డి ఈ సీజన్లో కొన్ని గ్రామాలలో కేవలం ముహూర్తాలు మాత్రమే చేసి వందుతూకం వేయకుండా కాలేయ పని చేయడం వల్ల రైతులు దలాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆయన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక వీఆర్ఎస్ నాయకులు అయిన కేసీఆర్ హరీష్ రావు కేటీఆర్ లను విమర్శిస్తూ కాలయాపన చేయడం తప్ప ప్రజలకు మీరు ఈ పది నెలల్లో చేసింది ఏముందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచిన రైతులకు పూర్తి రుణమాఫీ చేయలేదు రైతు భరోసా ఇవ్వలేదు పెన్షన్లు 4000 రాలేదు కల్యాణ లక్ష్మి హుస్సే లేదు మా లక్ష్మి కింద మహిళలకు 2500 ఇవ్వలేదు ఇలా చెబుతూ పోతే మీ ఆరుగారంటీలు గాలికి పోయిన తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను హామీల అమలులో కాలయాపన చేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడడానికి టిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరిష్ రావు,అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నాయకత్వంలో ఏప్పుడు ప్రజల పక్షాన నిరుద్యోగ యువత పక్షాన పోరాటాలకు సిద్ధంగా టిఆర్ఎస్ పార్టీ పార్టీ శ్రేణులు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నామని భాస్కర్ తెలిపారు.

## చెక్పోస్ట్ కు నిప్పు పెట్టిన దుండగులు



మెదక్ జిల్లా (శుభోదయం న్యూస్): ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన చెక్పోస్టుకు దుండగులు నిప్పుపెట్టారు. తహశీల్దార్ మల్లయ్య కథనం ప్రకారం.. పొతంగల్ మండలం కొడిచెర్ల శివారులో సిర్పూర్ మార్గంలో నెల కిందట చెక్పోస్టు ఏర్పాటు చేయగా, ప్రతిరోజు సాయంత్రం వేళల్లో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సిబ్బంది వెళ్లగా, అప్పటికే చెక్పోస్ట్ కాలిపోయి ఉంది. దీంతో బుధవారం కోటగిరి ఎస్సై సందీప్కు ఫిర్యాదు చేశారు. ఇసుక మాఫియాపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా పాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలన గిరిజనుల భూములు లాక్కోవడమేనా ఇందిరమ్మ రాజ్యం



మెదక్ జిల్లా (శుభోదయం న్యూస్): ప్రజా పాలన పేరుతో గద్దెనెక్కిన సంవత్సరం కాలమైన ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేరాకుండా పూర్తి అమలు చేయలేని హామీలను ఇచ్చిన అసమర్ధత సీఎం రేవంత్ రెడ్డి. వరంగల్లో పర్యటనలో ఎలా చేస్తారని. వరంగల్ లో ఇచ్చిన డిక్లరేషన్ ఇప్పటివరకు కూడా అమలు చేయలేదు సరి కదా హామీల మీద నోరు తెరవని ప్రభుత్వం అసమర్థత సీఎం అసమర్థత మంత్రులు అసమర్ధతఎమ్మెల్యేలు.తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకురాలు.చింతలగుతారెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాను..ఎలక్షన్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చకుండా నోరు మెదపకుండా ప్రజల సమస్యలు గాలికి వదిలేసి ఢిల్లీ టూర్ లాంటి పోతున్న సీఎం బ్యాగులు మోయుటకు పనికొస్తాడు ప్రజల సమస్యలు తీర్చుటకు కాదు.. రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు ఎక్కడ రైతు బీమా ఎక్కడ అమలు చేయకుండా ఇప్పుడు రైతులతో జీవితాలతో ఆడుకుంటూ ఫార్మా కంపెనీ అని ఫార్మా పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడం పైశాచిక ఆనందం పొందుతున్నారు ఇది ఒక సీఎంకు తగని పని రికార్డ్ గాని దొక్కాడని పరిస్థితిలో గిరిజన బిడ్డలు అధికారం కోసం దేవుళ్ళ మీద ఒట్లు ఏ ఊరికి పోతే అక్కడ ఒట్లు తిని ఈరోజు గద్దెనెక్కిన అసమర్థత సీఎం రేవంత్ రెడ్డి. కొడంగల్ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరితమైన హామీలు దొంగ హామీలు కాంగ్రెస్ అధికారం వస్తే ప్రజలకు మంచి చేస్తా అన్నారు కానీ మీరు చేసే మంచి ఎక్కడ కనపడటం లేదు.తెలంగాణ రాష్ట్రం తొలి సీఎం బాబు కేసీఆర్ కుటుంబం పైన కక్ష సాధింపులు పాల్పడుతున్నారు సీఎం రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం ప్రజలు అన్ని గమనిస్తున్నారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా చెప్పుతో కొట్టినట్టుగా సమాధానం చెబుతారని బుద్ధి వచ్చేటట్టు చేస్తారని ప్రజలు నిర్ణయం చేసుకున్నారు..ఇట్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకురాలు చింతల గీతారెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గం.

## జెడిపల్లి రవి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

## దీనిలోకి నువ్వు దళిత సంఘాలను లాగడం నీ అవివేకానికి నిదర్శనం




మెదక్ జిల్లా (శుభోదయం న్యూస్): మా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ గారిని బిడ్డని సంబోధించి అవహేళన చేస్తున్న నీవు బిడ్డ నువ్వు కూడా జాగ్రత్తగా ఉండు అని హెచ్చరిస్తున్నాంమా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ గారిపై మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకో బిడ్డ రవిలిఉత్తం నరేష్, కూతురి సుమలత, కమటం మల్లేశంఅక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు ఉత్తం నరేష్, మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, ఎస్సీ సెల్ అధ్యక్షులు కమటం మల్లేశం మాట్లాడుతూ నిన్నటి రోజున మా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ గారు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారిపై చేసిన ఆరోపణలకు మేము కూడా కట్టుబడి ఉన్నాం. కానీ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి మాట్లాడుతూ మా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్ మాట్లాడిన మాటలను వక్రీకరించే ప్రయత్నం చేసి దాన్ని దళిత సంఘాలకు అంటగట్టడం నీ అవివేకానికి నిదర్శనమని తెలిపారు. అలాగే నీ భాష ఏదైతే ఉందో బిడ్డ అని మాట్లాడడం తగదు అని చెప్పేసి హెచ్చరిస్తా ఉన్నాం. ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని మేము కూడా దళిత బిడ్డలుగా కోరతా ఉన్నాం. దళిత సమాజం కోసం నువ్వు ఏనాడైనా మాట్లాడిన వ్యక్తివా సిరిసిల్ల నియోజకవర్గంలో నేరెళ్ల గ్రామంలో దళితులపైన మీ బిఆర్ఎస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తే ఆరోజు నీ నోరు ఎక్కడ పోయింది ఎందుకు మాట్లాడలేదు అంటే దళితులపైన నీ ప్రేమ ఏందో నీ చిత్తశుద్ధి ఏందో అర్థమవుతుంది బిడ్డ దళిత జాతిని అడ్డం పెట్టుకొని రాజకీయం చేయాలంటే చెల్లదు బిడ్డ రవి అని హెచ్చరిస్తావున్నావ్. మా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుని పైన మాట్లాడిన మాటలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తా ఉన్నాం. ఈ కార్యక్రమంలో కూతురి చందు, జీడిపల్లి రమేష్, పుల్లని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 157వ జాతీయ గ్రంథాలయ ముగింపు వేడుకులు



బుచియ్యపేట మండలం రిపోర్టర్ జి.శ్రీను (శుభోదయం న్యూస్):గ్రంథాలయాలను వినియోగించుకుంటే విజ్ఞానం పెరుగుతుందని ఎమ్ఈఓ-2 కాశీ విశ్వేశ్వరరావు,ఎస్ఐ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు పుస్తక పఠనంతోనే విజ్ఞానవంతులుగా మారుతారన్నారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్ లకు ఇంటర్నెట్ కు అలవాటు పడి జీవితం నాశనం చేసుకుంటున్నార న్నారు. వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని చెప్పారు. విద్యార్థులు ఖాళీగా ఉన్న సమయాల్లో గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞానాన్ని సమకూర్చుకోవాలని సూచించారు.ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఉపయోగించిన విద్యార్థులు ఎవరూ చెడు మార్గం పట్టే అవకాశం ఉండదని తెలియజేశారు.ఉన్నత స్థాయికి ఎదగాలంటే కష్టపడి చదవాలన్నారు.స్వాతంత్ర్య ఉద్యమాలకు గ్రంథాలయాలు నిలయాలుగా పనిచేసేయన్నారు.ఈ సందర్భంగా వారం రోజులు పాటు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ కాశీ విశ్వేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారని గ్రంథాలయ అధికారి కృష్ణారావును అభినందించారు.ఈ కార్యక్రమంలో వియ్యపు నాగరాజు,సుంకర చిరంజీవి,స్థానిక జాజిమొగ్గల హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఎం ఆవాస్ యోజనను సద్వినియోగం చేసుకోండి

## మంత్రి, నియోజకవర్గ ఇంచార్ హరీష్ బాబు





ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలు ఇంటి కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గం ఇంచార్జ్ హరీష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో సూచించారు.ఈ పథకంలో భాగంగా ఇంటి స్థలం ఉన్న వారు తమ పరిధిలోని సచివాలయాల్లో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు భార్యభర్తల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకుఖాతా, జాబ్ కార్డు, స్థలానికి సంబంధించి పోజిషన్ సర్టిఫికెట్, రెండు పాస్ ఫొటోలు, భార్యభర్తల గ్రూపు ఫొటో, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను సంబంధిత గ్రామ సచివాలయం లోని ఇంజనీర్ అసిస్టెంట్‌కు అందజేయాలని వారు సూచించారు. ఇల్లు లేని నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్లను మంజూరు చేయిస్తామని హరీష్ బాబు పేర్కొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం సామాజిక సమరసత వేదిక



ధర్మవరం, నియోజకవం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి(శుభోదయం న్యూస్ ):పట్టణంలోని ఖండా కన్వీనర్ పులిచెర్ల శ్రీనివాసులు స్వగృహమునందు సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సమరసత దీపావళి కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష కన్వీనర్లు కేత గోపాల్ వాసు దేవయ్యలు ముఖ్య అతిథులుగా హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ వారిశుద్ధ్య కార్మికులు సేవలు అనన్యమైనవని ,సమాజంలో చాలా విలువైనవని వారు తెలిపారు. అంతేకాకుండా సమాజం విస్మరించరాదని వారు తెలియజేశారు. అనంతరం విహెచ్పి విభాగ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిచర్ల వేణుగోపాల్ మాట్లాడుతూ సంత్ రవిదాస్ లాంటి మహా పురుషులు జన్మించిన దేశం ఈ దేశమని, మధ్య యుగాల్లో మతం మారకుండా, శిక్షలు అనుభవించి, పారిశుద్ధ్య కార్మికులుగా మారిన అనేక వేలమంది వీరుల సంతానం పారిశుద్ధ్య కార్మికులని వారు తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులైన వెంకటేష్, మారుతి, లక్ష్మి ,ఎస్. లక్ష్మి ,చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి నాగరాజు, సభ్యులు కృష్ణమూర్తి ,హరి, వెంకటేష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేలో అందరికీ న్యాయం జరుగుతుంది ఆర్డీవో మహేష్




ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్ ):రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి గ్రామములో నిర్వహించబడే రీ సర్వేలో అందరికీ తప్పక న్యాయం చేకూర్చుతుందని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల పరిధిలోని తుమ్మలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక లోని గ్రామసభను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, షెడ్యూల్ తేదీల ప్రకారం పరిష్కరించబడుతుందని తెలిపారు. తదుపరి కొంతమంది రైతులు తమ సమస్యలను విన్నవించుకున్నారు ఏ సమస్య అయినా కూడా సచివాలయంలో ఇవ్వాలని వారు తెలిపారు. తదుపరి తుమ్మల లోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని అన్ని రికార్డులను వారు పరిశీలిస్తూ, ఉద్యోగుల అటెండెన్స్ లను తనిఖీ చేస్తూ సమయపాలనలో తేడా రాకూడదని వారు హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. ఉద్యోగులందరూ కూడా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తే గ్రామ ప్రజల సమస్యలు సులభతరంగా పరిష్కారం అవుతాయని వారు సూచించారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్ బాబు, వీఆర్వో ప్రసాద్ ,గ్రామ సర్వేయర్ వాణి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పంపిణీ చేయాలి

# ఆర్డిఓ మహేష్




ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్ ):ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులందరికీ విధిగా పంపిణీ చేయాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని శివానగర్లో గల మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తదుపరి తరగతుల యొక్క గదులను, మరుగుదొడ్లను, వంటగదిని వారు పరిశీలించి, పరిశుభ్రతంగా ఉండే విధంగా చూడాలని హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణకు సూచించారు. తదుపరి నిర్మాణం లో ఉన్న గదులను కూడా వారు పరిశీలించారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ లను, మధ్యాహ్న భోజన రిజిస్టర్లను వారు పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన చదువును ఉపాధ్యాయులు అందరూ కూడా సమన్వయంతో బోధించాలని తెలిపారు. విద్యార్థులకు మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, విద్యార్థులను తమ కన్న బిడ్డల లాగా చూసుకోవాలని తెలిపారు. ఎక్కడ ఎటువంటి తప్పిదాలు జరిగిన సహించేది లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. లక్ష్మీనారాయణ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ వాలీబాల్ స్థాయికి ఎంపికైన మున్సిపల్ విద్యార్థులు

### హెడ్మాస్టర్ పద్మజ



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్ ):జాతీయ వాలీబాల్ స్థాయి పోటీలకు పట్టణంలోని కొత్తపేటలో గల ఎస్పీసీఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని హెడ్మాస్టర్ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీయందు మా విద్యార్థులు ప్రతిభను ఘనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో ఎస్. చరణ్ కుమార్ యు. పుష్పాంజయ్ ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఎంపికైన ఈ విద్యార్థులు డిసెంబర్ 6 నుండి 8 వరకు జరుగు పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం హెడ్మాస్టర్ తో పాటు, ఎంఈఓ రాజేశ్వరి దేవి,టీచర్ ఆదినారాయణ, భాస్కర్, పీఈటి పద్మాబాయి,ఉపాధ్యాయ బృందం, బోధ నేతర బృందం, పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## చక్కటి కంటిచూపుతోనే మెరుగైన విద్య లభిస్తుంది

### కంటి వైద్య నిపుణులు,రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ ఎస్. నరసింహులు



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్ ):చక్కటి కంటిచూపుతోనే మెరుగైన విద్య లభిస్తుందని కంటి వైద్య నిపుణులు రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ ఎస్. నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని జీవనజ్యోతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు గల విద్యార్థులకు"జాతీయ హ్రస్వ దృష్టి వారోత్సవాలు" ముగింపు కార్యక్రమంను పురస్కరించుకొని కంటి చూపు సమస్యలు వాటి పరిష్కారం పై పలు విషయాలను పాఠశాల ప్రార్థన సమయంలో తెలియజేశారు. అదేవిధంగా కంటిని ఎలా కాపాడుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, కంటికి భద్రత ఎలా ఇవ్వాలి అన్న విషయాన్ని విశదీకరించారు. అనంతరం డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులందరికీ కంటి చూపు సక్రమంగా ఉంటే చక్కటి విద్య లభిస్తుందని, అప్పుడే ఉత్తమ పరీక్ష ఫలితాలు లభించే అవకాశం ఉన్నాయని తెలిపారు. ప్రతి తరగతి లోని ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల యొక్క కంటి చూపు పై శ్రద్ధను కనపరచాలన్నారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా సమిష్టిగా తమ పిల్లల పట్ల తప్పనిసరిగా శ్రద్ధను చూపాలని తెలిపారు. తదుపరి విద్యార్థుల యొక్క దృష్టి లోపాలను గుర్తించి కంటి డాక్టర్ సలహాతో వైద్య చికిత్సలు చేయించి కంటి అద్దాలను ఉపయోగించాలని తెలిపారు. నా కూతురు అయిన మధు బిందు, పూర్వ విద్యార్థి చంద్రశేఖర్ రెడ్డి తాము చదువుకున్న జీవన్ జ్యోతి లో ఈ కార్యక్రమం నిర్వహించడం నిజంగా అభినందించదగ్గ విషయమని వారు తెలిపారు. చదువులో బాగా రాణించాలి అంటే చక్కటి కంటిచూపు ఎంతో అవసరమని, టీవీ, సెల్ ఫోన్ లకు పూర్తిగా దూరంగా ఉండాలని తెలిపారు. ఇవి అలవాటు పడితే చదువులో కూడా వెనుక పడే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా కంటికి దగ్గరగా పెట్టుకుని చదువుతూ ఉంటే దృష్టిలోపముగా గుర్తించవలెనని తెలిపారు. అదేవిధంగా తరగతి గదిలో నల్ల బోర్డు పై రాసిన అక్షరాలు కనపడని వారు కూడా దృష్టిలోపం ఉన్న వారిగా గుర్తించాలని తెలిపారు. కంటి చూపు పట్టిక ద్వారా కూడా కంటి దోషమును గుర్తించవచ్చునని తెలిపారు. అనంతరం పాఠశాల లోని 170 మంది విద్యార్థిని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించి వారి వారి యొక్క దృష్టిలోపమును తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. చిన్నారులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సుజాత, కర్రీస్పాండెంట్ రెన్సి, పూర్వపు విద్యార్థి, ఎంటోడు ఫార్మా సిటికల్ లిమిటెడ్ మెడికల్ రిప్రజెంటేటివ్ చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్ట్ ను సవరించాలి

### యు టి ఎఫ్ డిమాండ్



ధర్మవరం నియోజకవర్గం ఇంచార్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్ ):ఉమ్మడి అనంతపురం జిల్లా లో మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం ఇటీవల విడుదల చేసిన సీనియార్టీ లిస్టులో ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయుల లిస్ట్ నందు అనర్హతలు గల వారిని కూడా చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ యు టి ఎఫ్ ఉమ్మడి అనంతపురం నాయకులు నేడు డీఈవో కార్యాలయం నందు డి ఈ ఓ కి ,ప్రసాద్ బాబు కి ప్రాతినిధ్యం చేయడం జరిగింది.ఇందులో జరిగిన అవకతవకలను తొలగించి కేవలం అర్హత గల వారికి మాత్రమే ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు ఇవ్వాలని యు టి ఎఫ్ డిమాండ్ చేస్తున్నది అదేవిధంగా మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు 70 :30% ప్రకారం ఖాళీలను ప్రదర్శించాలని అర్హత గల అన్ని సబ్జెక్టులలో ప్రమోషన్ లు చేపట్టాలని కోరుచున్నాము.ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, అనంతపురం నగర యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, ఆదిశేషయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రష్యాపై ఉక్రెయిన్ క్షిపణి దాడి.. పుతిన్ ప్రతీకార దాడి చేయించేనా..?



పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన క్షిపణులను ఉపయోగించి ఉక్రెయిన్ ప్రభుత్వం రష్యాపై తొలి దాడి చేసింది. రష్యాపై లాంగర్ రేంజ్ క్షిపణులను ప్రయోగించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చారు. దాంతో రష్యా త్వరలో ప్రతీకారం తీర్చుకోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎందుకంటే రష్యాపై ఉక్రెయిన్ నాటో దళం పంపిన క్షిపణిని ప్రయోగించింది. ఇది తనపై పరోక్షంగా నాటో దాడిగా రష్యా భావిస్తే పరిస్థితి చేయి దాటిపోతుంది. అణ్వాయుధ రహిత దేశాలపై అణ్వాయుధాల ప్రయోగానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇవాళే ఆమోదం తెలిపారు. దాంతో ఉక్రెయిన్ సహా అణ్వాయుధరహిత దేశాలపై అణ్వాయుధాలను ప్రయోగించాలని ప్రయోగించేందుకు రష్యా సైన్యానికి అనుమతి లభించింది.దీనంతటికీ కారణం ఒక విధంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అని చెప్పవచ్చు. జో బైడెన్ చేసిన తప్పిదం వల్ల ప్రపంచ స్థాయిలో అణుయుద్ధం వచ్చే ప్రమాదం పొంచి ఉంది. అమెరికా తీసుకున్న నిర్ణయం మనం నాటోతో ప్రత్యక్ష యుద్ధంలో ఉన్నామని తెలియజేస్తోందని పుతిన్ ఇప్పటికే తన కార్యవర్గంతో అన్నారు. ఇప్పుడు బైడెన్ నిర్ణయంతో ఉక్రెయిన్ క్షిపణి దాడికి పాల్పడటం రష్యాకు మరింత ఆగ్రహం తెప్పిస్తోంది.

## ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ ఆస్తుల విలువ ఎంతో తెలుసా..?



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. ఆయన భార్య సైరా భానుతో విడిపోయారు. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ముగింపు ప్రకటించారు. విడాకులపై అడ్వకేట్ సమాచారం అందించారు. ఈ క్రమంలో ఏఆర్ రెహమాన్ ఆస్తులపై చర్చ సాగుతున్నది. ప్రస్తుతం అత్యధికంగా సంపాదిస్తున్న భారతీయ సంగీత దర్శకుల్లో ఆయన ఒకరు. రికార్డ్ ప్లేయర్‌గా తొలిసారిగా రూ.50 పారితోషకం అందుకున్న ఏఆర్ రెహమాన్ ప్రస్తుతం నికర సంపద రూ.1700కోట్లు. రోజా మూవీతో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చిన రెహమాన్.. ఆ సమయంలో రూ.25వేలు అందుకున్నాడు. లైఫ్ స్టయిల్ ఆసియా నివేదిక ప్రకారం.. స్లమ్‌డాగ్ మిలియనీర్‌కు ఆస్కార్‌ను అందుకున్న రెహమాన్ నికర ఆస్తుల విలువ 200 నుంచి 400 మిలియన్



డాలర్లు.భారతీయ కరెన్సీలో అక్షరాల రూ.1700కోట్లు. ప్రస్తుతం ఒక్కో సినిమాకు స్వరాలు సమకూర్చేందుకు రెహమాన్ దాదాపు రూ.8కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు ఛార్జ్ చేస్తున్నారు. ఆయన కేవలం ఒక పాట కోసం రూ.3కోట్ల వరకు వసూలు చేయనున్నారు. అంతేకాకుండా ఆయన లైవ్‌షోలు సైతం చేస్తుంటారు. దాంతో భారీగానే ఆదాయం ఆర్జిస్తున్నారు. ఒక్కో గంటకు దాదాపు రూ.కోటి నుంచి రూ.2కోట్ల వరకు వసూలు చేస్తారు. రెహమాన్‌కు భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ బంగ్లాలు ఉన్నాయి. భారత్‌లో చెన్నైతో బంగ్లాతో పాటు అమెరికాలోని లాస్ ఏంజిల్స్, దుబాయిలో ఇండ్లు ఉన్నాయి. వోల్వో ఎస్‌యూవీ, జాగ్వార్, మెర్సిడెజ్ తదితర ఖరీదైన కార్లు ఉన్నాయని ఓ నివేదిక పేర్కొంది. కుమార్తెలు ఖతీజా, రహీమా వద్ద రూ.1.5కోట్ల విలువైన ఎలక్ట్రిక్ పోర్స్చే టైకాన్ కార్లు ఉన్నాయి.

శుభోదయం

సంపాదకీయం

# రగులుతున్న అగ్నిపర్వతం!

## (విశ్లేషణ)

ఏణ్ణర్థం దాటినా... మణిపుర్ మండుతూనే ఉంది. జాతుల మధ్య ఘర్షణ తగ్గకపోగా, అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా పదిరోజుల క్రితం ఓ కుకీ మహిళ అత్యాచారం – హత్య, దానికి ప్రతిగా మెయితీలపై కుకీ తీవ్రవాదుల దాడులు, చివరకు ఓ సహాయ శిబిరం నుంచి నవంబర్‌లో అపహరణకు గురైన ఓ పసిబిడ్డతో సహా ఆరుగురు అమాయక మెయితీలు ప్రాణాలు కోల్పోవడం...ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. సీఎం సహా రాష్ట్రంలో ప్రజా ప్రతినిధుల ఇళ్ళపై దాడులతో చివరకు రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో కర్ఫ్యూ, ఇంటర్నెట్ స్తంభన, వివాదాస్పదమైన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం విధింపు, కేంద్రం నుంచి అదనపు బలగాలను పంపడం దాకా వెళ్ళింది. ప్రభుత్వ మనుగడకు ముప్పేమీ లేకున్నా, బీజేపీ సర్కారుకు తమ మద్దతును ఉపసంహరించుకున్నట్టు నేషనల్ పీపుల్స్ పార్టీ ప్రకటించడం మిత్రుల్లోనూ బీజేపీ పట్ల పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనం. గత 2023 మేలో హింసాకాండ మొదలైనప్పటి నుంచి జాతుల ఘర్షణల్లో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 60 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. ఎంతసేపటికీ బాహ్య శక్తులు కారణమంటూ ఆరోపించడం, శుష్కవాగ్దానాలు చేయడమే తప్ప, రాష్ట్రం రావణకాష్ఠమైనా పరిస్థితిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. మణిపుర్ సామాజిక – ఆర్థిక జీవితంలో జాతుల ఉనికి అత్యంత కీలకమైనది. దాన్నిబట్టే ఆ ఈశాన్య రాష్ట్రంలో భూములపై హక్కులు, తదనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక విభేదాలు రూపు దిద్దుకుంటూ వచ్చాయి. దాదాపు డజనుకు పైగా గిరిజన తెగలను కలిపి, బ్రిటీషు పాలనా కాలంలో కుకీలు అని పేరుపెట్టారు. విభిన్న జాతుల్లో ప్రధానమైనవైన మెయితీ వర్గానికీ, కుకీలకూ మధ్య పాలకులు తమ స్వార్థప్రయోజనాల కోసం అగ్నికి ఆజ్యం పోశారు. అదే అసలు సమస్య. జనరల్ వర్గానికి చెందిన మెయితీలు తమకు కూడా షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) హోదా కల్పించాలని కోరు తున్నారు. అయితే, దానివల్ల తమ ప్రయోజనాలు దెబ్బ తింటాయని కుకీల ఆందోళన. మరోపక్క మిజోరమ్‌తోనూ, పొరుగున మయన్మార్‌లోని చిన్ రాష్ట్రంతోనూ జాతి సంబంధాలున్న కుకీల వాంఛ వేరు. మణిపుర్ నుంచి తమ ప్రాంతాన్ని విభజించి, ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పాటు చేయాలని వారు బలంగా వాదిస్తున్నారు. ఇది చాలదన్నట్టు మెయితీ వర్గానికి చెందిన మణిపుర్ ప్రస్తుత ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ, కుకీలను అణచివేస్తున్నారనే అభిప్రాయం రోజురోజుకూ బలపడుతూ వచ్చింది. ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణమయ్యాయి.కారణాలు ఏమైనా, రాష్ట్రంలోని బీజేపీ పాలిత ప్రభుత్వ సారథి అన్ని వర్గాలనూ ఒక తాటి మీదకు తీసుకురావడంలో విఫలమవడంతో బాధ్యత అంతా కేంద్రం భుజాల మీద పడింది. కేంద్ర హోమ్‌శాఖ మొన్న అక్టోబర్‌లో మెయితీ, కుకీల వర్గాల రాజకీయ ప్రతినిధులతో సమావేశం జరిపింది కానీ, శాంతిసాధన దిశగా అడుగులు పడలేదు. ప్రత్యేక శాసనవ్యవస్థతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం తమకు కావాల్సిందేనని కుకీలు భీష్మించుకు కూర్చున్నారు. మణిపుర్ విభజనతో మాత్రమే సాధ్యం. అయితే, కేంద్ర జోక్యంతో సమస్యను పరిష్కరించవచ్చని ఇప్పటికీ కుకీలు భావిస్తున్నారు. ఇంత సంక్షోభంలోనూ అది ఓ సానుకూల అంశం. ఢిల్లీ పెద్దలు దాన్ని వినియోగించుకోవాలి. కానీ, అలా జరుగుతున్నట్టు లేదు. విధానపరంగా, రాజకీయంగా సీఎం విఫలమయ్యారని తెలుస్తున్నా, గద్దె మీది బీరేన్‌సింగ్‌ను మార్చడానికి బీజేపీ, కేంద్రంలోని ఆ పార్టీ పెద్దలు ఎందుకు ముందుకు రావడం లేదో తెలియదు. బీరేన్‌పై అంత ప్రేమ ఎందుకన్నది బేతాళప్రశ్న. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ప్రగతి అంటే ఇదేనా? మణిపుర్‌ను దేశంలో అంతర్భాగమని వారు అనుకోవట్లేదా? ఈశాన్యంలో పార్టీ విస్తరణపై ఉన్న శ్రద్ధలో కాసింతైనా శాంతిస్థాపనపై కాషాయ పెద్దలకు ఎందుకు లేదు? అంతకంతకూ క్షీణిస్తున్న పరిస్థితులు ప్రభుత్వంతో పాటు రాజకీయ పక్షాలు సైతం బాధ్యతను వదిలేశాయనడానికి సూచన. ఈ సంక్షుభిత ఈశాన్య రాష్ట్రానికి ఇప్పుడు కాస్తంత సాంత్వన కావాలి. బాధిత వర్గాలన్నిటినీ ఓదార్చి, ఉపశమనం కలిగించే పెద్ద మనసు కావాలి. పౌరసమాజాన్ని కూడా భాగస్వామ్యపక్షం చేసి, సమస్యకు రాజకీయ పరిష్కారం చూడడమే మార్గం. అందుకు కేంద్ర సర్కారు ఇప్పటికైనా చిత్తశుద్ధితో చొరవ తీసుకోవాలి. పాలకులు మణిపుర్‌ను వట్టి శాంతిభద్రతల కోణం నుంచే చూస్తే కష్టం. దాని వల్ల సామాన్య ప్రజానీకానికీ, ఈశాన్య ప్రాంతంలోని సాయుధ బలగాలకూ కష్టాలు పెరుగుతాయి. రాష్ట్రంలో చేజారిన పరిస్థితుల్ని ఇప్పటికైనా చక్కదిద్దేందుకు కేంద్రం ప్రయత్నించకపోతే, అది దేశ సమగ్రతకే ప్రమాదం. పొరుగున మయన్మార్, బంగ్లాదేశ్‌లలో సంక్షుభిత వాతావరణం నెలకొని ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తత అత్యవసరం. అనేక సాయుధ తీవ్రవాద గ్రూపులతో, ఇట్టే చొరబాట్లకు చాలా అవకాశం ఉన్న సరిహద్దుల్లో మణిపుర్ ఉందని విస్మరించరాదు. కేవలం సాయుధ బలగాల మోహరింపుతో అక్కడ శాంతి సాధ్యంకాదు. హింసలో తాత్కాలిక విరామాన్ని చూపి, అదే శాంతి అని నమ్మబలకడం మూర?త్వం. అన్ని వర్గాల మధ్య సామరస్యం, సహజీవనం సాగేలా రాజకీయ ఏర్పాటు చేయగలిగితేనే హింసకు తెర పడుతుంది. కేంద్రం ఇప్పటికైనా చిత్తశుద్ధితో అందుకు సర్వశక్తులూ ఒడ్డాలి. లేదంటే, అగ్ని పర్వతం సమీపంలోనే ఉన్నా అలసత్వంతో వ్యవహరిస్తున్నట్టే! దాదాపు 33 లక్షల సోదర భారతీయ జనాభాను స్వార్థ ఆర్థిక, అధికార ప్రయోజనాల కోసం గాలికి వదిలేస్తున్నట్టే! గుజరాత్, ముజఫర్ నగర్, ఢిల్లీ లాంటి అనేక చోట కొద్ది రోజుల్లో హింసకు ముకుతాడు వేయగలిగినచోట ఇన్ని నెలలుగా ఒక రాష్ట్రాన్ని మంటల్లో వదిలేయడం ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ పాలకులకు సిగ్గుచేటు!

# యూపీ ఉప ఎన్నికలు..
# ఈసీ వార్నింగ్, ఏడుగురి పోలీసుల సస్పెండ్




మహారాష్ట్ర, ఝూర?ండ్‌లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. వీటితోపాటు దేశ వ్యాప్తంగా పలు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నేడు జరుగుతున్నాయి. అయితే ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల పోలింగ్‌లో పోలీసులు బురఖా ధరించిన ఓటర్లను తనిఖీ చేయడంపై వివాదం చేలరేగింది. దీనిపై తాజాగా ఎన్నికల సంఘం స్పందించింది. నిష్పక్షపాతంగా ఉప ఎన్నికలు జరిగేలా చూడాలని భారత ఎన్నికల సంఘం బుధవారం అధికారులను కోరింది. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్ల గుర్తింపు కార్డులను తనిఖీ చేయడానికి మార్గదర్శకాలను ఉల్లంఘించిన పోలీసు సిబ్బందిని కూడా ఈసీ సస్పెండ్ చేసింది.అర్హత ఉన్న ఓటరు ఓటు వేయకుండా అడ్డుకోరాదని తెలిపింది. ఓటింగ్ సమయంలో ఎలాంటి పక్షపాత వైఖరిని సహించబోమని స్పష్టం చేసింది. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరుపుతామని, ఎవరైనా దోషులుగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక కొనసాగుతుండగా.. బురఖా ధరించిన ఓటర్ల గుర్తింపును సరిగ్గా తనిఖీ చేయాలని బీజేపీ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు బీజేపీ నేత అఖిలేష్ కుమార్ అవస్తీ లేఖ రాసింది. ముసుగులు ధరించిన మహిళలు చాలాసార్లు ఓటు వేయడానికి ప్రయత్నించిన కేసులు గతంలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. అంతేకగాక కొంతమంది పురుషులు కూడా బురఖా ధరించి ఓటు వేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. అయితే వీరిని ఈసీ అధికారులు అడ్డుకున్నారని చెప్పారు. బురఖా ధరించిన మహిళల గుర్తింపును తనిఖీ చేయకపోతే, నకిలీ ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. సరైన తనిఖీ మాత్రమే న్యాయమైన, పారదర్శకమైన ఓటింగ్‌కు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బురఖా ధరించిన మహిళలను తనిఖీ చేసేందుకు తగిన సంఖ్యలో మహిళా





పోలీసులను పోలింగ్ కేంద్రాల వద్ద తప్పనిసరిగా మోహరించాలని ఆయన అన్నారు. ఓటరు ఐడీ కార్డులను తనిఖీ చేస్తున్న పోలీసులపై ప్రతిపక్ష సమాజ్ వాదీ పార్టీ ధ్వజమెత్తింది. పార్టీ చీఫ్, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ ఇద్దరు పోలీసులు ఓటర్ల గుర్తింపు కార్డులు అడిగే వీడియోను షేర్ చేస్తూ.. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ జోక్యాన్ని కోరారు."ఎన్నికల సంఘం యాక్టివ్‌గా ఉంటే.. పోలీసులు ఓటర్ల ఐడీలను తనిఖీ చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. రోడ్లు మూసివేయకుండా, ఐడీలను స్వాధీనం చేసుకోకుండా, ఓటర్లను బెదిరించకుండా, ఓటింగ్ వేగం మందగించకుండా, సమయం వృధా కాకుండా చూసుకోవాలని అన్నారు. అధికార పార్టీకి ప్రతినిధిగా ఉండకుండా పరిపాలనను చూసుకోవాలని తెలిపారు. అయితే అఖిలేష్ యాదవ్ పోస్టుపై కాన్పూర్ పోలీసులు సైతం స్పందించారు. ఓటర్లను తనిఖీ చేసిన సంబంధిత అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.. ఎన్నికల సమయంలో రాష్ట్ర పోలీసులు ఎన్నికల సంఘం ఆధీనంలోకి వస్తారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్ల గుర్తింపు కార్డులను తనిఖీ చేయడానికి మార్గదర్శకాలను ఉల్లంఘించిన పోలీసు సిబ్బందిని కూడా ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది.

# మూడో ప్రపంచయుద్ధం..
# వినాశనం తప్పదా?



అగ్రరాజ్యం అమెరికా ఎన్నికల ఫలితం మూడో ప్రపంచ యుద్ధానికి తెరలేపిందా? అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ విజయాన్ని జీర్ణించుకోలేని బైడెన్.. ప్రపంచ యుద్ధానికి తెరలేపే నిర్ణయం తీసుకున్నారా? అంటే ప్రపంచ దేశాల మేధావులు అవుననే అంటున్నారు. బైడెన్ ఓటమి ఉక్రోషంతో తీసుకున్నా, వయస్సు రిత్యా వివేకం, వివేచనా కోల్పోయి తీసుకున్నా.. ఆయన నిర్ణయం ప్రపంచాన్ని మూడో ప్రపంచ యుద్ధం ముంగిట నిలిపింది. ఇంతకీ బైడెన్ ఏం చేశారంటే.. అమెరికా ఇచ్చిన క్షిపణులను ఉక్రెయిన్ రష్యాపై ప్రయోగించడానికి అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పుతిన్... అణ్వాయుధాలను యుద్ధంలో ఉపయోగించడానికి అనుమతి ఇస్తూ ఉత్తర్వ్యులు ఇచ్చేశారు. దీంతో ప్రపంచం అంతటా యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. ఉక్రెయిన్ కు ఆయుధాలు సరఫరా చేసే ఏ దేశంపైనైనా దాడులు చేస్తామని పుతిన్ గతంలోనే హెచ్చరించిన సంగతి తెలిసిదే. ఆ సమయంలోనే ఆయన అణు దాడికి కూడా వెనుకాడబోమని విస్పష్టంగా చెప్పారు. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు బైడెన్ అధికారం నుంచి దిగిపోవడానికి సరిగ్గా రెండు నెలల ముందు తమ దేశం సరఫరా చేసిన క్షిపణులను రష్యాపై ప్రయోగించడానికి ఉక్రెయిన్ కు అనుమతి ఇచ్చేశారు. దీంతో మండిపడిన పుతిన్ అణ్వాయుధాల వినియోగానికి తమ సైన్యానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. వాస్తవానికి ట్రంప్ ఎన్నికలలో గెలవడానికి ప్రధాన కారణం తాను అధికారంలోకి వస్తే రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ఇచ్చిన హామీయే అని చెప్పడానికి సందేహించాల్సిన అవసరం లేదు. పుతిన్, ట్రంప్ ల మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో అమెరికన్లు ఆయన అధికార పగ్గాలు చేపడితే రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలరని



నమ్మారు. అదే సమయంలో ట్రంప్ కు ప్రత్యర్థిగా అమెరికా ఎన్నికలలో పోటీ చేసిన బైడెన్ నాల విధాకారణంగానే ఓటమి పాలయ్యారు.%మహారా బైడెన్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన నాటి నుంచీ ఇజ్రాయెల్ కు మద్దతుగా నిలిచారు. పరోక్షంగా పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలోనే ప్రపంచానికి పెద్దన్నగా తనకు తాను చెప్పుకునే అమెరికా ఉక్రెయిన్ కు తన క్షిపణుల వినియోగానికి అనుమతించడం ద్వారా రష్యాను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టేంత వరకూ రష్యా, ఉక్రెయిన్ల మధ్య ఉద్రిక్తతలు, పరస్పర దాడులు పెచ్చరిల్లకుండా ఇరు దేశాలు నియంత్రణ పాటించాలని ప్రపంచ దేశాలు కోరుతున్నాయి.

# చెప్పేకొద్దీ అంత పంతం ఎందుకు..
# కేంద్రానికి సీఎం మాస్ వార్నింగ్..!



ప్రాంతీయవాదాన్ని బలంగా వినిపించడంలో తమిళనాడు ప్రభుత్వం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుంది. అది భాషాపరమైన అంశమైన సాంప్రదాయాలైనా.. కేంద్రం తీసుకున్న నిర్ణయాల్లో అది ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నచ్చని అంశమైతే అందుకోసం ఎంత దూరమైనా పోరాడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గతంలో జల్లికట్టు విషయంలో సుప్రీంకోర్టు నిషేధం ఉన్న యావత్ తమిళనాడు ప్రజలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేసి, కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా అనుమతినిచ్చేదాకా పోరాటం కొనసాగింది. అలాంటిది కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని లెక్కచేయకుండా మాపై బలవంతంగా హిందీని రుద్దాలని చూస్తే మేము ఊరుకోమని అన్ని ప్రభుత్వాలు కేంద్రాన్ని హెచ్చరించాయి. తాజాగా మరోసారి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రానికి మాస్ వార్నింగ్ ఇచ్చారు. భారతదేశానికి స్వాతంత్రం రాకముందు వచ్చిన తర్వాత కూడా తమిళ రాష్ట్రంలో హిందీ భాష అమలు చేయడానికి వ్యతిరేకిస్తూ పోరాటాలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. 1960లో ద్రవిడ కళగం అనే పార్టీ నుంచి విడిపోయి ద్రవిడ మున్నేట్ర కలగంగా ఏర్పడ్డ డిఎంకె అప్పటి నుంచి హిందీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూనే ఉంది. ఆ తర్వాత వచ్చిన ఏడీఎంకే ప్రభుత్వం కూడా తమిళుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని సెంటిమెంట్ అంశంగా భావించి హిందీని వ్యతిరేకిస్తూనే వచ్చింది. ఇటీవల కొద్ది కొద్దిగా తమిళనాడులో హిందీ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. గతంలో తమిళనాడులో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు రైల్వేస్టేషన్‌లో బోర్డుల్లో తమిళం ఇంగ్లీషు అక్షరాలు మాత్రమే ఉండేవి.. మూడేళ్ల క్రితం నుంచి రైల్వే స్టేషన్‌లో హిందీ అక్షరాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల వాటిని వ్యతిరేకించేవారు తొలగించినప్పటికీ మిగిలిన చోట్ల హిందీ బోర్డులు కొనసాగుతూనే ఉన్నాయి.తాగారా చెన్నైలో ఉన్న ఎల్ఐసి కార్యాలయం.. ఎల్ఐసి వెబ్‌సైట్‌లో ఆంగ్లం, తమిళం ఆప్షన్ తొలగించి హిందీ మాత్రమే ఉంచడాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా ఆక్షేపించింది. దశాబ్దాలుగా హిందీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న మాపై బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నాన్ని కేంద్రం పదే పదే చేస్తుండడానికి సీఎం స్టాలిన్ తప్పుపట్టారు. ప్రాంతీయ భాషలను తొలగించడమే కాకుండా ఇంగ్లీష్ ఎంచుకున్నా కూడా హిందీ భాషలోనే ఉండడం సరైనది కాదన్నారు. ఇది భారతదేశ వైవిధ్యాన్ని తుంగలో తొక్కి బలవంతంగా హిందీ భాషని మాపై వృద్ధి ప్రయోగమే తప్ప మరొకటి కాదని స్టాలిన్ అన్నారు. ఎల్ఐసి భారతీయులందరికీ ప్రోత్సాహంతో అభివృద్ధి చెందుతున్నప్పుడు మెజారిటీ ఖాతాదారులకు ద్రోహం చేసే అధికారం మీకు ఎక్కడిదని ప్రశ్నించారు. ఈ భాష దౌర్జన్యాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా కేంద్రానికి వ్యతిరేకంగా హిందీ పై తమిళనాడు చేస్తున్న పోరాటం మరోసారి తెరపైకి వచ్చింది.


# కాంగ్రెస్ కీలక నిర్ణయం.. !!



**న్యూఢిల్లీ,:** జార?ండ్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జోరుగా కొనసాగుతోంది. మొత్తం 38 నియోజకవర్గాల్లో పలువురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటోన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి నిల్చున్నారు. అటు మహారాష్ట్రలో 288 నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటోన్నారు. జార?ండ్‌తో పోల్చుకుంటే మహారాష్ట్రలో తొలి రెండు గంటల్లో పోలింగ్ మందకొడిగా సాగడం గమనార్హం. మధ్యాహ్నం 3 గంటల సమయానికి జార?ండ్‌లో 61.47 శాతం మేర పోలింగ్ రిజిస్టర్ అయింది. మహారాష్ట్రలో ఈ సంఖ్య 45.53 శాతమే. ఈ రెండింటితో పాటు దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో ఉప ఎన్నికల పోలింగ్ కూడా ముమ్మరంగా సాగుతోంది. మహారాష్ట్రలోని నాందెడ్ లోక్‌సభ నియోజకవర్గానికీ ఉప ఎన్నిక నేడే జరుగుతోంది. కాంగ్రెస్ సిట్టింగ్ లోక్‌సభ సభ్యుడు వసంత్ రావ్ బల్వంత్ రావ్ చవాన్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అవసరమైంది. పాలక్కాడ్- కేరళ, ఛబ్బెవాల్- పంజాబ్, గిద్దర్‌బాహా- పంజాబ్, డేరా బాబా నానక్- పంజాబ్, బర్నాలా- పంజాబ్, ఘజియాబాద్- ఉత్తర ప్రదేశ్, మఝువాన్- ఉత్తర ప్రదేశ్, మీరాపూర్- ఉత్తర ప్రదేశ్, ఖైర్- ఉత్తర ప్రదేశ్, ఫూల్‌పూర్- ఉత్తర ప్రదేశ్, కుందార్కి- ఉత్తర ప్రదేశ్, కర్హాల్, కటేహారి- ఉత్తర ప్రదేశ్, కేదార్‌నాథ్- ఉత్తరాఖండ్ నియోజకవర్గాలకు ఉప ఎన్నిక కొనసాగుతోంది. ఆయా ఎన్నికల ఫలితాలు ఈ నెల 23వ తేదీన వెలువడతాయి. కాగా- పోలింగ్ ప్రక్రియ మగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలపై తాము నిర్వహించిన సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌పై తమ అంచనాలను వెల్లడించనున్నాయి. ఇదివరకు హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పెద్దగా వాస్తవ రూపాన్ని దాల్చని నేపథ్యంలో ఈ సారి ఎలా ఉంటాయనేది ఆసక్తి రేపుతోంది. కాగా- ఈ పరిణామాల మధ్య అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఎగ్జిట్ పోల్స్ సందర్భంగా టీవీ ఛానళ్లు, వివిధ మీడియా సంస్థలు నిర్వహించబోయే డిబేట్లల్లో పాల్గొనకూడదని నిర్ణయించింది. ఈ చర్చల్లో పార్టీ తరఫున ఎవ్వరూ పాల్గొనకూడదని ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా పాల్గొంటే అది వారి వ్యక్తిగత అభిప్రాయమౌతుందని పేర్కొంది. టీవీ ఛానళ్లు తమ టీఆర్పీ రేటింగ్స్‌ను పెంచుకోవడానికి ఇలాంటి డిబేట్లను పెడుతుంటాయని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతోంది. ఈ ఏడాది ముగిసిన లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌కు కూడా కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రజా తీర్పు ఈవీఎంలల్లో నిక్షిప్తమైందని, రాజెవరో, బంటెవరో ఓట్ల లెక్కింపులో తేలుతుందని పేర్కొంది.

## జీడిమెట్ల పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం..

## కార్మికుడి మృతి.. మరో ముగ్గురి పరిస్థితి..




**హైదరాబాద్, :** ఒక్కోసారి చిన్నపాటి నిర్లక్ష్యంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఆస్తితో పాటు ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం కూడా ఉంది. తాజాగా హైదరాబాద్ శివారులోని జీడిమెట్ల ఆరోరా పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రియాక్టర్ లో కెమికల్ మిక్స్ చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది.. ఈ ప్రమాదంలో సూరారానికి చెందిన కార్మికుడు అనిల్ కుమార్ మృతి చెందగా, మరో ముగ్గురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి.. గాయపడిన కార్మికులను సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ కు గుట్టు చప్పుడు కాకుండా తరలించారు.. ఆ తర్వాత బంధువులకు సమాచారమిచ్చారు. కంపెనీ దగ్గరకు చేరుకున్న బాధిత బంధువులకు సమాచారం ఇవ్వడం లేదు. ఘటన స్థలానికి చేరుకున్న సూరారం పోలీసులు, ఫైర్ సిబ్బంది ఎందుకు సమాచారం ఇవ్వలేదని యాజమాన్యాన్ని ప్రశ్నించారు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. గతేడాది మార్చి ఒకటిన కూడా ఆరోరా ఫార్మాస్యూటికల్స్ కంపెనీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆ పరిశ్రమలో రియాక్టర్ పేలి చెలరేగిన మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో.. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వారు ఈ పరిశ్రమలో కార్మికులుగా పని చేస్తున్నట్లు తెలిసింది. కార్మికులు రవీందర్‌రెడ్డి(25), కుమార్(24)గా పోలీసులు గుర్తించారు. వారి మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఢిల్లీ హైకోర్టులో కేంద్ర మాజీమంత్రి చిదంబరానికి బిగ్ రిలీఫ్



**న్యూఢిల్లీ,:** ఎయిర్‌సెల్- మ్యాక్సిస్ మనీలాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి పి.చిదంబరానికి ఢిల్లీ హైకోర్టులో బిగ్ రిలీఫ్ దొరికింది. ఆయనపై విచారణకు అనుమతిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై న్యాయస్థానం స్టే ఇచ్చింది. సింగిల్ జడ్జి ధర్మాసనం ఈమేరకు ఈడీకి నోటీసులు ఇచ్చింది. అయితే, ఎయిర్ సెల్- మ్యాక్సిస్ కేసులో చిందంబరం, ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ ఛార్జిషీట్‌లు దాఖలు చేయడంతో.. కేంద్ర మాజీమంత్రిపై విచారణకు ట్రయల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఆ ఉత్తర్వులను నిలిపివేయాలంటూ చిందంబరం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. తాజాగా విచారణకు స్టే విధించింది. కాగా, పి. చిదంబరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా విధులు నిర్వహించినప్పుడు ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందంలో ఫారిన్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు అనుమతుల్లో అవకతవకలు జరిగాయని అనేక ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలోనే చిదంబరంతో పాటు ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై పోలీసులు కేసు నమోదు చేసింది. అయితే, ఈ కేసుకు సంబంధించి 2018లో సీబీఐ, ఈడీ రెండు వేర్వేరు ఛార్జిషీట్లను దాఖలు చేసింది.

## టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు గుడ్‌న్యూస్..!



**అమరావతి,:** టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త చెప్పారు మంత్రి పొంగూరు నారాయణ.. త్వరలోనే లబ్దిదారుల సమస్యలు పరిష్కరించేలా ముందుకెళ్తున్నాం అన్నారు.. శాసనమండలిలో టిడ్కో ఇళ్లపై ఎమ్మెల్సీలు తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన మంత్రి నారాయణ.. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్ల కోసం 5546.48 కోట్లు రుణం వివిధ రూపాల్లో తీసుకుందన్నారు.. టీడీపీ ప్రభుత్వం 5 లక్షల ఇళ్లకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతులిస్తే వాటిని 2,61,660కు తగ్గించేసిందని విమర్శించారు.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా గత టీడీపీ ప్రభుత్వంలో హైటెక్నాలజీ, హై క్వాలిటీతో ఇళ్ల నిర్మాణం చేపట్టాం. గత ప్రభుత్వం పై మాపై కక్షతో లబ్దిదారుల పట్ల దారుణంగా వ్యవహరించారని ఆరోపించారు.. ఇళ్లు ఇవ్వని వారి పేరు మీద కూడా బ్యాంకు లోన్ లు తీసుకోవడంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని.. లబ్దిదారులకు తిరిగి చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో మున్సిపల్ ఆఫీస్ ల చుట్టూ తిరుగుతున్నారు. ఇక, గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ లో పెట్టేశారని దుయ్యబట్టారు మంత్రి నారాయణ.. అయితే, టిడ్కో ఇళ్లకు రంగులు మార్చడం కోసం ఏకంగా 300 కోట్ల రూపాయాలు ఖర్చు చేశారని మండిపడ్డారు.. టిడ్కో ఇళ్లకు మౌలికవసతుల కల్పన కోసం 5200 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశామని.. త్వరలోనే లబ్దిదారుల సమస్యలు పరిష్కరించేలా ముందుకెళ్తున్నాం అని స్పష్టం చేశారు మంత్రి పొంగూరు నారాయణ..

# ఆనందాంధ్రను ఆవిష్కరించే బడ్జెట్!



ఆనందాంధ్రను ఆవిష్కరించే విధంగా రాష్ట్ర బడ్జెట్ రూపొందించారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. పన్నుల బాదుడు జోలికి పోకుండా కొత్త ఆదాయ వనరులను అన్వేషిస్తూ, మూలధన వ్యయాన్ని పెంచుతూ రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించే విధంగా బడ్జెట్‌లో బాటలు వేశారు. అభివృద్ధి పూర్తిగా అడుగంటి ఏపీ అస్తిత్వమే ప్రశ్నార్థకమయిన వేళ రాష్ట్ర భవిష్యత్తును కాచుకోవడమే లక్ష్యంగా విధ్వంస ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ మహాయజ్ఞానికి ఎన్డీయే 2.0 ప్రభుత్వం సమగ్ర ఆర్థిక ప్రణాళికను రూపొందించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీర్చిదిద్దిన 2024-25 ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ నవనిర్మాణం దిశగా కొత్త అడుగులువేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి పునరంకితమవుతూ నిధుల కేటాయింపులు చేశారు. అభివృద్ధి సంక్షేమం, ఎన్నికల హామీల అమలు, రాజధాని, పోలవరం నిర్మాణం వంటి అనేక ఒత్తిళ్ల మధ్య కూడా భారీ కసరత్తు చేసి భారీ బడ్జెట్‌ను రూపొందించారు. ఏ వర్గాన్ని అసంతృప్తి పరచకుండా దీర్ఘకాలంలో చేకూరే ప్రయోజనాలు.. ప్రస్తుతం చేకూరే ప్రయోజనాలు, హామీలు, భరోసాలు బాగానే కల్పించారు. బడ్జెట్ రూపొందించే సమయంలో వాస్తవికతను ప్రజల కళ్లకు కట్టారు. భారమైనా భారీగానే బడ్జెట్ కేటాయింపులు జరిపి సమస్యలకు తలొగ్గేదిలేదన్న తెగువను కనబర్చారు ఆర్థిక మంత్రి.

### రాజధానికి నిధులు..

విధ్వంసమైన రాష్ట్ర పునర్నిర్మాణానికి, అన్ని వర్గాల అభ్యున్నతికి ఆర్థిక మంత్రి కేశవ్ తొలి పద్దు వేగుచుక్కలా పొడిచింది. రాజధానికి నిధులిచ్చింది. పోలవరానికి వరాలు కురిపించింది. అమరావతి, పోలవరాన్ని వేగంగా నిర్మించాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యాలకు అనుగుణంగా అన్నివైపుల నుంచి సహకారం లభిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి, భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలకు కలిపి రూ.3,445 కోట్లు కేటాయించారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణాన్ని ఒక కొలిక్కి తేవాలన్న లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేశారు. ఒకవైపు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల సాయానికి పచ్చజెండా ఊపిన ప్రభుత్వం రాజధాని పనులు పరుగులు పెట్టించేందుకు బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులు ఇచ్చింది. రాబోయే నాలుగు నెలల్లో ఈ నిధులతో అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీయనున్నది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల కింద ఆస్తులు సృష్టించేలా మూలధన వ్యయం చేసేందుకు రూ.32,712 కోట్లు కేటాయించారు..

### పోలవరానికి వరాలు..

అయిదు కోట్ల ఆంధ్రుల జలదేవాలయం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 5.445 కోట్లు కేటాయించడం అభినందనీయం. పోలవరం ప్రాజెక్టు తొలి దశకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు మోడీ ప్రభుత్వం అంగీకరించింది. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం సహా మిగిలిన నిర్మాణ పనులు 2027 మార్చినాటికి పూర్తి చేసి జాతికి అంకితం చెయ్యనున్నారు.. అమరావతి, పోలవరం నిర్మాణాలను పరుగులు తీయించాలని నిర్ణయించడం సీఎం చంద్రబాబు దీక్షా దక్షతలకు అద్దం పడుతుంది. 2025, న్యూ ఇయర్‌లో ఆంధ్రప్రదేశ్ గేరు మార్చబోతున్నది. ఏపీని వెలుగుల వైపు మళ్లించబోతున్నారు.

### తొలి పద్దులోనే సూపర్ సిక్స్

తన తొలి పద్దులోనే సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ పేదల గుండెల్లో ఎన్డీయే ప్రభుత్వానికి పెద్దపేట వేశారు. అన్నదాతా సుఖీభవా అంటూ, అమ్మకు వందనాలు పలికింది తొలిపద్దు. ఆడబిడ్డ నిధితో పాటు త్వరలోనే కొత్త సంక్షేమ పథకాలు ప్రారంభం కాబోతున్నాయని సంకేతాలిచ్చింది. జగన్ జమానాలో మంగళం పాడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా మళ్లీ స్వయం ఉపాధి పథకాలు చేపట్టేందుకు వీలుగా రాయితీపై రుణాలిచ్చేందుకు బాటలు వేశారు. గత పాలనలో దగా పడ్డ మధ్య తరగతి ప్రజలు, అట్టడుగు ప్రజలు వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అన్ని వర్గాల జీవనాన్ని గుణాత్మకంగా మార్చే బృహత్తర లక్ష్య సాధన కోసం పేదప్రజల సంక్షేమానికి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించింది. చదువుకునే ప్రతి విద్యార్థికి రూ. 15 వేల చొప్పున సాయం చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా దీనికోసం తల్లికి వందనం' పథకానికి రూ.6,487 కోట్లుబడ్జెట్ లో కేటాయించడం హర్షణీయం.

### రైతుల సంక్షేమానికి 43 వేల కోట్లు..

వ్యవసాయ ప్రధానమైన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు కలిపి రూ.48,402 కోట్లు కేటాయించారు. ఇందులో ఉచిత విద్యుత్తు రూ.7.211 కోట్లు, జలవనరుల శాఖకు రూ. 16,705 కోట్లు ఖర్చు చెయ్యనున్నారు. వంశధార స్టేజ్- 2, వెలిగొండ, హంద్రీనీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి, చింతలపూడి ఎత్తిపోతల పథకంకు, మహేంద్ర తనయ సాగునీటి ప్రాజెక్టులతో పాటు అనేక ఇతర ప్రాజెక్టులు నిర్మాణానికి నిధులు కేటాయించడం అభినందనీయం.

### రహదారులకు మహర్దశ!

గత ఐదేళ్లలో రాష్ట్రంలో రహదారులు ధ్వంసమయ్యాయి. గత ప్రభుత్వం కనీసం గుంటలు కూడా పూడ్చలేదు. ఈ బడ్జెట్‌లో రహదారుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇందుకోసం రూ.5.441 కోట్లు కేటాయించారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.1,098 కోట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.16,739 కోట్లు కేటాయించారు. పల్లెల్లో జలజీవన్ మిషన్ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆసియా మౌలిక సౌకర్యాల అభివృద్ధి బ్యాంకు నిధులతో చేపట్టే ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులిచ్చి ఇళ్లలో జలజీవన్ మిషన్ పనులు ఊపందుకునేందుకు ఈ బడ్జెట్ వీలు కల్పించింది. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహక బకాయిలు చెల్లించేందుకు ఈ బడ్జెట్‌లో రూ.2,270.70 కోట్లు నిధులు కేటాయించారు.. కొత్తగా పెట్టుబడులతో వచ్చే పారిశ్రామిక వేత్తలకు భూసేకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మూలధన వ్యయం కింద నిధులు కేటాయించారు. 2019లో రూ.3.6 లక్షల కోట్ల మేర ఉన్న రాష్ట్ర రుణభారం 2024 మార్చి నాటికి దాదాపు రూ.11లక్షల కోట్లకు చేరింది. వీటిని సరిదిద్దడానికి కొత్త ప్రభుత్వం దృఢసంకల్పంతో, సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి. ఈ క్రమంలో ద్రవ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎదురుగా కనిపిస్తున్న దారి కంటకప్రాయమైనదే. అయినా శక్తివంచన లేకుండా కష్టించి ప్రజల కలలను నిజం చేసేందుకు నూతన చైతన్యం నిండిన దార్శనికత వున్న నాయకుడు పాలకుడిగా వున్నారు. ఏపీ భవిత చాలా ఆశాజనకంగా కనబడుతోంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని మరింత ఉన్నతమైన ఉత్సాహంతో భవిష్యత్తు కోసం దృఢ సంకల్పంతో ముందుకు నడస్తే ఆనందాంధ్రను ఆవిష్కరించవచ్చు.

# పాఠశాల విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించాలంటే..



2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పాఠశాల విద్యపై బడ్జెట్లో నిధుల కేటాయింపు గతం కంటే పెరిగాయి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య గణనీయంగా పెరిగింది. మౌలిక సదుపాయాల కల్పనలో చెప్పుకోదగిన అభివృద్ధి కనిపించింది. స్టాఫ్ చొరవ, నిరంతర ప్రయత్నాల వల్ల పాఠశాల మానేయడం వంటి సమస్యలు కొంత మేరకు తగ్గుమొహం పట్టాయి. అయితే ముఖ్యంగా అణగారిన సమూహాలలో, ఎస్సీ, ఎస్టీ, బాలికలు, అంగవైకల్యమున్న విద్యార్థులలో ఈ డ్రాపౌట్స్ ప్రధాన సమస్యగా కొనసాగుతుంది. ఇందుకు ఇటీవల యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) తెలంగాణ విద్యా విభాగం, విద్యా మంత్రిత్వ శాఖ నుండి లభించిన నివేదికలలో డేటాను ఉపయోగించి పరిష్కారాలు సూచించాను.

### బడి మానేయడానికి కారణాలు..

సామాజిక-ఆర్థిక అసమానతలు, దారి ద్ర్యం తెలంగాణ విద్య విభాగం 2023 నుండి వచ్చిన డేటా ప్రకారం రాష్ట్రంలో 29.4 శాతం మందికి ఆర్థిక సమస్యలే పాఠశాల మానేయడానికి ప్రధాన అవరోధంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో బడి మానేయడం సుమారు 35 శాతానికి చేరుకుంది. ఎస్సీ, ఎస్టీ సమూహాలు ప్రత్యేకంగా ఈ సమస్యలతో ప్రభావితమవుతాయి. ఇక సాంస్కృతిక ప్రమాణాలు తెలంగాణ మహిళా కమిషన్ 2022 నివేదిక ప్రకారం, అణగారిన సమూహాలకు చెందిన అమ్మాయిలలో 14.8 శాతం మంది మధ్యంతరంగా పాఠశాల విద్య పూర్తి చేయకముందే బడి మానేస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఎన్.ఎఫ్.హెచ్.ఎస్ డేటా ప్రకారం, అమ్మాయిలలో 30 శాతం మంది చిన్న వయసులో వివాహం, ఇంటి బాధ్యతలను కారణంగా మానేశారు. 12 శాతం మంది భద్రత, దూరాన్ని కారణంగా చూపించారు. ఇక 2022లో తెలంగాణ రాష్ట్ర విద్యా నివేదిక ప్రకారం, 42 శాతం గ్రామీణ పాఠశాలలు అమ్మాయుల పాఠశాలల్లో పనిచేసే శౌచాలయాలు కలిగి లేవని ఇందువల్ల 21.6 శాతం అమ్మాయిలు బడి మానేయడానికి కారణమవుతుందని తెలిపింది. అలాగే సుమారు 18 శాతం పాఠశాలల్లో అంగవైకల్యమున్న విద్యార్థుల కోసం పాఠశాలల్లో యాక్సెస్ ర్యాంపుల సదుపాయాలను కలిగి లేవని తద్వారా అంగవైకల్యమున్న విద్యార్థుల డ్రాపౌట్స్ 50 శాతం కంటే ఎక్కువయ్యాయని తెలిపింది.

### తగిన ప్రమాణాలు లేని కారణంగా..

ఇక నేర్చుకునే విద్యలో లోటుపాట్లు అకడమిక్ సవాళ్లు ఒక రకంగా డ్రాపౌట్స్‌కి కారణమవుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. జాతీయ సాధన సర్వే 2021 ప్రకారం, తెలంగాణలో 5వ తరగతి నుండి 8వ తరగతుల్లో ఉన్న విద్యార్థులలో 39 శాతం మంది విద్యార్థులు గ్రేడ్‌కి తగిన ప్రమాణాలు కలిగిన చదువు లభిం చటం లేదని ముఖ్యంగా గణితం నైపుణ్యాలను కలిగి ఉండటం లేదని తెలి పింది. కొవిడ్-19 తరువాత అకడమిక్‌గా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల మధ్య డ్రాపౌట్ సంఖ్య 16 శాతం పెరిగిందని, ఇక గ్రామీణ తెలంగాణలో యూనిసెఫ్ 2021 నివేదిక ప్రకారం, గ్రామీణ విద్యార్థుల్లో 27 శాతం మంది లాక్‌డౌన్ తరువాత పాఠశాలకు తిరిగి రాలేదని పరిమిత డిజిటల్ యాక్సెస్ ఈ సవాళ్లను మరింత పెంచిందని తెలపింది. ఇక బడి మానేసిన ఎస్సీ, ఎస్టీ పిల్లల్లో 41 శాతం మంది అనధికార కార్మిక లేదా తక్కువ వేతన ఉద్యోగాలలో పనిచేస్తున్న వారు ఉన్నారు. 9 శాతం మాత్రమే తదుపరి వృత్తి లేదా నైపుణ్య ఆధారిత శిక్షణను కొనసాగిస్తున్నారు.


### ప్రభుత్వ పథకాల కారణంగా..

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ స్కీమ్‌ల మూలంగా తెలంగాణలో బాల్య వివాహాల సంఖ్య తగ్గింది. డ్రాపౌట్ల రేట్లపై కూడా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపించింది. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల రేట్లను 12 శాతం తగ్గించడంలో సహాయపడింది. అయితే నిపుణులు దీన్ని అమ్మాయిలకు విద్యను కొనసాగించటానికి ప్రోత్సాహకంగా ఈ పథకాన్ని విస్తరించాల్సిందిగా సూచిస్తున్నారు. అలాగే తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ విస్తరణ తరువాత ఒక లక్షకు పైగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు లాభం చేకూరింది. అయితే ఇది ఇంకా ఎక్కువ మందికి అవకాశం కల్పించాల్సి ఉంది. ఇక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల చర్యలకు చేపట్టిన 'మన ఊరు- మన బడి' పథకం ద్వారా 1200లలో మౌలిక సదుపాయాలు మెరుగుపడినప్పటికీ ఇంకా మారు మూల ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాలు మెరుగుపడాలి.

### డ్రాపౌట్లను తగ్గించడానికి..

పాఠశాలల్లో డ్రాపౌట్లను తగ్గించేందుకు అణగారిన విద్యార్థులకు ఆర్థిక సహా యంగా ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను పెంచి సకాలంలో విద్యార్థులకు అందిం చాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను విస్తరించాలి. సామాజిక చైతన్యంతో విద్యార్థుల సంఖ్య నమోదు, రిటెన్షన్ మెరుగుపడుతుంది. ముఖ్యం గా అమ్మాయిల కోసం, తల్లిదండ్రులు, స్థానిక నాయకులను చేర్చే కార్యక్రమాలు డ్రాపౌట్ రేట్లను సుమారు 15 శాతం వరకు తగ్గించగలవని స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ తెలిపింది. విద్యా కార్యక్రమా లు, బ్రిడ్జ్ కోర్సులు, అకడమిక్ లోటుల ను పరిష్కరించాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీకి యాక్సెస్‌ను మెరుగుపరచాలి. డ్రాపౌట్ సమస్య సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మౌలిక అంశాలతో ప్రభావితమై ఉంది. వీటిని పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ సంస్థలు కుటుంబాలు ఉమ్మడి ప్రయత్నం చేయటం అవసరం. సమగ్ర విద్యపై దృష్టి పెట్టడం ద్వారా తెలంగాణలో డ్రాపౌట్ల రేట్లను తగ్గించడానికి వీలవుతుంది.

# కులగణన స్ఫూర్తి గ్రహించక కువిమర్శలు!



రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఎన్నో విప్లవాత్మక సామాజిక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా కులగణన చేపడతామన్న అంశాన్ని పొందుపరిచింది. కాంగ్రెస్ మేనిఫెస్టో 'పాంచ్ న్యాయ్'లో భాగంగా 'హిస్సేదార్ న్యాయ్'లో దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని, రిజర్వేషన్‌పై ఉన్న 50శాతం పరిమితిని తొలగిస్తామని రెండు కీలకమైన వాగ్దానాలను రాహుల్‌గాంధీ చేశారు. ఆయన ఆలోచనలకు రూపంగా తెలంగాణలో మహోన్నతమైన కులగణన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి నవంబర్ 6న శ్రీకారం చుట్టారు. వెనుకబడిన తరగతుల ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడానికి భూసాని వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో డెడికేషన్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. ఇందుకుగాను రూ.150 కోట్లను కేటాయించగా, 80 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు సర్వేలో భాగస్వాములవుతూ, ప్రజల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. 1953లో కాకా కలేల్కర్ కమిషన్, 1978లో మండల్ కమిషన్, 2017లో జస్టిస్ రోహిణి కమిషన్‌లు కూడా సామాజిక ఆర్థిక అసమానతలు తెలుసుకోవడానికి కులగణన జరగాలని అభిప్రాయపడ్డాయి. తెలంగాణలో దాదాపు 154పైగా బీసీ కులాలు, ఉప కులాలు ఉన్నాయి. ఇప్పటికీ కనీస గుర్తింపుకు నోచుకోని కులాలు ఉన్నాయి. ఇవన్నీ సామాజికంగాను, ఆర్థికంగాను, అక్షరాస్యతలోను వెనుకబడి ఉన్నాయి. రాజకీయపరంగా, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందక, సరైన గుర్తింపు లేక దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కులగణనతో అలాంటి వారి జీవన విధానం మారనున్నది. ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలుకుతూ ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలోనూ, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులకు అందేట్టు చేయడంలోనూ ఈ కుల గణన సర్వే ఎంతో కీలకం కానున్నది. గతంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. కానీ ఆ గణాంకాలను స్వార్థపూరిత కుల రాజకీయాలకు వాడుకున్నారు తప్పితే రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. ప్రతిపక్ష పార్టీలు సదరు గణాంకాలు రాష్ట్ర ప్రజలకు తెలియపరచాలని ఎంత మొత్తుకున్నా ఏనాడూ వెల్లడించలేదు. కేవలం కులాలను ఓటు బ్యాంకుగా మార్చుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆర్థిక జీవన విధానం మారాలి. దామాషా ప్రకారం ఎవరికి దక్కాల్సిన వాటా వారికి దక్కాలి. అందుకు ఈ కులగణన గణాంకాలు ఉపయోగపడతాయి. కులగణనపై విపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టాయి. అసంబద్ధమైన ప్రశ్నలకు ఎక్కుపెడుతున్నాయి. పైపైన కులగణనకు తాము అనుకూలం అంటూనే ప్రజల మదిలో అనుమానాలను రేకెత్తించే విధంగా గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం సోషియో ఎకానమీ ప్రకారం సర్వే చేస్తోంది. గతంలో బిహార్ రాష్ట్రంలో కులగణన గణాంకాల ఆధారంగా 34 శాతం మంది ప్రజల రోజువారీ ఆదాయం 200 రూపాయలని తేలింది. అంటే నెలకు రూ. 6వేలు సంపాదిస్తున్నారు. అక్కడ జనాభా ప్రకారం బీసీల రిజర్వేషన్ 33 శాతం నుంచి 42 శాతానికి పెంచారు. ఎస్సీల రిజర్వేషన్ 17 శాతం నుంచి 23 వరకు పెంచారు. అలాగే ఇక్కడ కూడా ప్రభుత్వం ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నదే తప్ప గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా వివరాలు దాచి పబ్బం గడుపుకోవడానికి కాదు. బీసీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నది వాస్తవం. రానున్న స్థానిక ఎన్నికల్లో దామాషా ప్రకారం వారు రాజకీయ అవకాశాలను అందుకుంటారు. 2018లో పార్లమెంట్ సాక్షిగా రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ జనాభా గణనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కులగణన చేపడతామని చెప్పారు. కానీ ఓబీసీ కుల గణన చేపట్టబోమని స్పష్టం చేసారు. దీన్ని బట్టి చూస్తే బీజేపీ స్టాండ్ ఏమిటన్నది అర్థం అవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ వర్గానికి చెందిన వారైనప్పటికీ సర్వేకు విముఖత వ్యక్తం చేయడం గమనార్హం. లౌకిక దేశంలో మతాల ప్రాతిపదికన ఓట్లు దండుకోవడానికి రాజకీయాలు చేయడమే బీజేపీకి ప్రధాన ఎజెండాగా మారింది. ఆడలేక మద్దెల దరువు అన్నట్టు- దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని రాహుల్‌గాంధీ కోరితే- బీజేపీవారు అసలు రాహుల్‌గాంధీ కులం ఏమిటీ అని వ్యంగ్య విమర్శలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆర్థిక అసమానతలకు ప్రధాన కారణం కులమే. రాష్ట్రంలో జరుగుతున్న కులగణన ప్రక్రియ ద్వారా ప్రజల అభివృద్ధి, సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియకు అన్ని ప్రతిపక్ష పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలి.